అంతా మనోళ్లే... నేను చూసుకుంటాలే..!

- నగర బస్తీల్లో చోటామోటా నేతల హవా..
- డబుల్‌బెడ్‌రూం, ప్రభుత్వ పథకాలు ఇప్పిస్తామంటూ ఎర
- నేతలతో ఉన్న పరిచయాలను ఆసరా చేసుకుని అక్రమాలు
- ప్రజాప్రతినిధులు, అధికారులు దృష్టిసారించాలంటున్న లబ్దిదారులు



హైదరాబాద్, జనవరి 9,ప్రభాతవార్త: ఓపక్క ప్రభుత్వ పథకాలు అమలులో అవినీతికి పాల్పడుతున్న అధికారులపై ఉక్కుపాదం మోపుతుంటే మరోపక్క నగర బస్తీల్లోని చోటా మోటా లీడర్లు నయా దందాను కొనసాగిస్తున్నారు. ప్రభుత్వం నిర్మిస్తున్న డబుల్ బెడ్ రూం ఇళ్లు ఇప్పిస్తామంటూ ఒకరు.. నీకు పెన్షన్ రావడం లేదా.. నేను పెట్టిస్తా కాకపోతే ఖర్చవుతుందంటూ మరొకరు ఇలా నగరంలోని పలువురు కిందిస్థాయి నాయకులు అక్రమాలకు పాల్పడుతున్నారు. తాజాగా టీఎన్జీవోస్ కాలనీకి చెందిన నాగరాజు అనే వ్యక్తి శేరిలింగంపల్లి ఎమ్మార్వో ఆఫీస్‌లో పని చేస్తున్నానని,తనకు ఉన్నతాధికారులు తెలుసని డబుల్ బెడ్ రూం ఇండ్లు ఇప్పిస్తానని 22 మంది వద్ద డబ్బులు వసూలు చేశాడు. ఒక్కొక్కరి దగ్గర నుంచి రూ. 50 వేలు చొప్పున దాదాపు రూ.10 నుంచి 15 లక్షలు వసూళ్లు చేసినట్లు సమాచారం. అయితే బాధితులు పలుమార్లు నాగరాజుకు ఫోన్ చేయగా ఆఫీసులో ఉన్నాను.. కలెక్టరేట్‌లో ఉన్నాను అంటూ బకాయిస్తూ తప్పించుకుంటూ తిరుగుతున్నాడు. మోసపోయామని గుర్తించిన బాధితులు గచ్చిబౌలి పోలీసులకు ఫిర్యాదు చేశారు.

అలాగే గతేడాదిలో రూ50వేలకు డబుల్‌బెడ్‌రూం ఇళ్లు ఇప్పిస్తామని అక్రమంగా పాల్పడుతున్న వ్యక్తిని బాలనగర్ పోలీసులకు అరెస్ట్ చేశారు. ఫిరోజ్‌గూడలో ఓప్రైవేట్ స్కూల్‌వద్ద సుమారు 50మంది డబ్బులు ఇచ్చినవారు సదరు వ్యక్తి నిలదీస్తుండగా బిఆర్ఎస్ నాయకులు అతడిని పోలీసులకు అప్పగించడంతో బయటపడింది.

పరిచయాలను ఆసరాగా చేసుకుని..

స్థానిక ప్రజాప్రతినిధులతో ఉన్నపరిచయాలను ఆసరాగా చేసుకుని పలువురు కింది స్థాయి నేతలు ఈఅక్రమాలకు పాల్పడుతున్నారు. ఎమ్మెల్యేలు,ఎంపీలు బస్తీల్లో పాదయాత్రలు, మీటింగ్‌లు నిర్వహించినప్పుడు వారిని పేరుపెట్టి పిలవడం, వారితోరెండు నిమిషాలు అలా మాట్లాడడం సహజమే. అయితే వీరు వారికి దగ్గర మనుషులైనట్లుగా ప్రవర్తిస్తూ ఆపరిచయాన్ని పెట్టుబడిగా మార్చుకుంటున్నారు. దీన్ని ఆసరాగా చేసుకుని మంత్రి తెలుసు ఎమ్మెల్యే తెలుసు,కార్పొరేటర్ మనోడే అంటూ ప్రచారం చేసుకుంటున్నారు. వారి సిఫారస్‌తో పథకాలు ఇప్పఇస్తామంటూ దరఖాస్తులు భర్తీ చేయడం దగ్గరనుంచి చెక్కు వచ్చేంత వరకు వివిధ దశల్లో డబ్బులు వసూలు చేస్తూ దోపిడికి పాల్పడుతున్నారు. వీరి అరాచకాలకు బయపడి లబ్దిదారులు అడిగినంత చెల్లిస్తున్నారు.

నగరాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దడమే లక్ష్యం : మేయర్ విజయలక్ష్మీ

సికింద్రాబాద్, జనవరి 9 ప్రభాతవార్తః నగరంలోని అన్ని డివిజన్‌లను సమగ్రంగా అభివృద్ధి పర్చడం కోసం ప్రణాళికలు రూపొందించామని, వాటిని అమలు జరుపడం త్వరలోనే ప్రారంభిస్తామని గ్రేటర్ హైదరబాద్ మేయర్ గద్వాల్ విజయలక్ష్మీ తెలిపారు. కార్పొరేటర్‌ల పనితీరును కూడా మెరుగు పర్చడం కోసం వృషి చేస్తామని తెలిపారు. సికింద్రాబాద్ నియోజకవర్గం బౌద్ధనగర్ డివిజన్‌లో ఎంపీ అనిల్ కుమార్‌యాదవ్, డిప్యూటీ మేయర్ మోతే శ్రీలతలు బౌద్ధనగర్ డివిజన్ కార్పొరేటర్ కంది శైలజ, జీహెచ్ఎంసీ లోని వివిధ విభాగాల అధికారులతో కలిసి పర్యటించారు. స్థానికంగా ఉన్న సమస్యలను పరిశీలించారు. ఇక్కడి ప్రజలను వారు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమే మాట్లాడుతూ కాంగ్రెస్ పాలనలో అభివృద్ధి వేగవంతం అవుతుందని తెలిపారు. డివిజన్‌లలో ఉన్న సమస్యలను స్థానికుల నుండి తెలుసుకొని వాటిని వెంటనే పరిష్కరిస్తామని. నగర వ్యాప్తంగా ఇలాంటి చర్యలు తీసుకుంటామని చెప్పారు. ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం పరిపాలన సాగిస్తుందని మేయర్ గారు తెలిపారు. సికింద్రాబాద్ నియోజకవర్గం కంటెస్టెడ్ ఎమ్మెల్యే ఆదం. సంతోష్ కుమార్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో

బౌద్ధనగర్ డివిజన్‌లో పర్యటిస్తున్న మేయర్ గద్వాల్ విజయలక్ష్మీ, ఎంపీ అనిల్‌కుమార్ తదితరులు

ఆదం సృజన్ కుమార్, అనిల్, బ్రహ్మాజీ, అమర్‌నాథ్ గౌడ్, గంట రాజుసాగర్, అభిషేక్, కిషోర్, రవి కుమార్, చక్రధర్, వాహిదుద్దీన్, చలం, షకీల్ ఖాన్‌లు పాల్గొన్నారు.

నృత్యాభినయంతో అరణ్యనాట్య గురువందనం

చిన్నారి కళాకారిణులు గురువందనంలో దృశ్యాలు

రవీంద్రభారతి, జనవరి 9 ప్రభాతవార్త : ప్రముఖ అరణ్య నాట్యం నృత్యఅకాడమీ ఆధ్వర్యంలో ప్రఖ్యాత నాట్యగురువు, 900లకుపైగా నృత్యప్రదర్శనలతో విశిష్ట కీర్తి, పేరు ప్రఖ్యాతులు సాధించిన ఎన్.వి.ఎన్.సమతారావు నిర్వహణలో సంస్థ శిష్యబృందంచే భరతనాట్య శైలిలో నృత్యాభినయంతో ప్రఖ్యాత నాట్యగురువులు విఎస్.రామమూర్తి, మంజుల రామస్వామి తదితర గురువులకు గురువందనం కావించారు. గురువారం రాత్రి రవీంద్రభారతి ప్రధాన మందిరంలో జ్యోతిప్రకాసనంతో ప్రారంభమైన గురువందనంలో 50మంది విద్యార్థులు గణేశ పంచరత్నం, దేవీస్తుతి, హనుమాన్ చాలీసా తదితర అంశాలతో శృతిలయబద్ధంగా నాట్యప్రదర్శనలు అందించారు. ఈ కార్యక్రమానికి కేంద్ర సంగీత నాటక అకాడమీ అవార్డు గ్రహీత మంజుల రామస్వామి ముఖ్యఅతిథిగా పాల్గొని కళాకారులను ఎంతగానో అభినందించారు.

చెరువుల పరిరక్షణకు "హైడ్రా" కఠిన చర్యలు : కమిషనర్ రంగనాథ్

- నెక్‌నాంపూర్ చెరువును పరిశీలించిన కమిషనర్

- ఎఫ్‌టిఎల్‌లో పోసిన మట్టిని తొలగించాలని ఆదేశం

నార్సింగి, జనవరి 9 ప్రభాతవార్త : చెరువుల పరిరక్షణకు "హైడ్రా" కటినమైన చర్యలు తీసుకుంటుందని కమీషనర్ రంగనాథ్ హెచ్చరించారు. గురువారం గండిపేట మండలం నెక్‌నాంపూర్ చిన్న చెరువు ఎఫ్‌టిఎల్‌ను హైడ్రా కమీషనర్ తన సిబ్బందితో కలిసి వచ్చి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎఫ్‌టిఎల్‌లో వేసిన మట్టిని వెంటనే తొలగించాలని సిబ్బందిని ఆదేశించారు. అలాగే చెరువులోకి నీటిని మోసుకు వచ్చే కాలువలు, నాలాలను మూసి వేయవద్దని సూచించారు. చెరువులు సహజ వనరులని, వాటి సంరక్షణ బాధ్యత ప్రతీ పౌరుడు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. చెరువులు నీటితో నిండి ఉంటేనే భూగర్భ నీటి మట్టం పడిపోకుండా ఉంటుందని, లేదంటే భూగర్భ నీటి మట్టం పడిపోతుందని ఆందోళన వ్యక్తం చేశారు. హైదరాబాద్, దాని శివారులలో గొలుసుకట్టు చెరువుల వల్లనే పూర్వం అద్భుతమైన పంటలు పండించారని తెలిపారు. నాటి గ్రామాలన్నీ పట్టణాలుగా రూపాంతరం చెందడంతో చెరువులలోకి వరదలను తెచ్చే నీటి కాలువలు, నాలాలను కబ్జా చేశారని, ఫలితంగా నీరు లేక చెరువులు వెలవెలబోతున్నాయన్నారు. ఇదే అదునుగా భావించి చెరువు చుట్టు పక్కల వాళ్లు కబ్జాలు చేసి నిర్మాణాలు చేసుకున్నారన్నారు. షాటిలైట్ చిత్రాల ద్వారా ఏ గ్రామంలో ఎన్ని చెరువులున్నాయి? అవి ఎంత విస్తీర్ణంలో ఉండేవి? ఇప్పుడు ఎంత మిగిలాయి? ఎంత కబ్జాకు గురయ్యాయో? పూర్తి సమాచారంను సేకరించామన్నారు. చెరువుల పరిరక్షణ విషయంలో ఉపేక్షించేది లేదని, చెరువుల ఎఫ్‌టిఎల్, బఫర్ జోన్లలో వెలిసిన నిర్మాణాలను కూల్చి వేసి తీరుతామని స్పష్టం చేశారు. హైడ్రా ఏర్పడక ముందు అనుమతులు పొంది, భవనాలు నిర్మించుకున్న వారికి ఎలాంటి ఇబ్బందులు కలిగించమని, హైడ్రా ఏర్పడిన తరువాత నిబంధనలు ఉల్లంఘించిన వారి భరతం పడుతామని కమీషనర్ రంగనాథ్ స్పష్టం చేశారు.

నెక్‌నాంపూర్ చిన్న చెరువు ఎఫ్‌టిఎల్‌ను పరిశీలించిన హైడ్రా కమీషనర్ రంగనాథ్ దృశ్యం

బండ్లగూడ కార్పొరేషన్‌లో సెంట్రింగ్ కూలి ఏడుగురికి గాయాలు

బండ్లగూడలో సెంట్రింగ్ కూలిన ఘటనలో గాయాలపాలైన వారిని పరామర్శిస్తున్న మేయర్ లతాగౌడ్

నార్సింగి, జనవరి 9 ప్రభాతవార్త : బండ్లగూడ జాగీర్ కార్పోరేషన్ పరిధిలో సెంట్రింగ్ కూలి ఏడుగురు కూలీలు తీవ్ర గాయాలపాలయ్యారు. సెంట్రింగ్ డబ్బాల కింద ఇరుక్కుపోయిన కార్మికులను వెలికి తీసేందుకు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. పని చేస్తుండగానే ఒక్కసారిగా సెంట్రింగ్, కొంత శ్లాబ్ కూలి పడడంతో దాని కిందనే ఉన్న కార్మికులు అందులోనే చిక్కుకొని పోయారు. తోటి కార్మికులు, స్థానికులంతా కలిసి వారిని అతి కష్టం మీద బయటకు తీశారు. ఈ సంఘటనతో అక్కడ పని చేస్తున్న కార్మికులంతా షాక్‌కు గురయ్యారు. గాయపడ్డ కార్మికులందరికి మెరుగైన వైద్య ం అందించేందుకు ఆసుపత్రికి తరలించారు. భవన యాజమాన్యం కూడా వెంటనే స్పందించి మీరు కోలుకునేంత వరకు ఆసుపత్రి ఖర్చులు పూర్తిగా భరిస్తామని, దగ్గరుండి ఆసుపత్రిలో చేర్పించి చికిత్స చేయిస్తున్నారు. ఇంత ప్రమాదం జరిగినా ప్రాణనష్టం జరుగకపోవడంతో కార్మికులు, యాజమాన్యం ఊపిరి పీల్చుకున్నారు. ఈ సంఘటనపై పలువురు స్థానికులు సరైన జాగ్రత్తలు తీసుకోకుండా సెంట్రింగ్ పనులు చేయడం వల్లనే అది కూలి కార్మికుల ప్రాణాలపైకి తెచ్చిందని ఆరోపించారు. ఇలాంటి సంఘటనలు జరుగకుండా యాజమాన్యాలు, అధికారులు తగు చర్యలు తీసుకోవాలని స్థానికులు అభిప్రాయపడ్డారు.

బాధిత కార్మికులను పరామర్శించిన మేయర్ లతాగౌడ్

బండ్లగూడ కార్పోరేషన్ పరిధిలోని ఓ భవన నిర్మాణం వద్ద సెంట్రింగ్ డబ్బా కూలి కార్మికులు తీవ్ర గాయాలపాలయ్యారు. ఈ విషయంను తెలుసుకున్న స్థానిక మేయర్ మద్దెల లతా ప్రేమ్‌గౌడ్ వెంటనే ఆసుపత్రికి వెళ్లి బాధిత కార్మికులను పరామర్శించారు. మీకు పూర్తిగా అండగా ఉంటామని, మీరు కోలుకునేంత వరకు యాజమాన్యంతో మాట్లాడి అన్ని ఖర్చులు పెట్టిస్తామని భరోసా కల్పించారు. ఇలాంటి ఘటనలు భవిష్యత్తులో జరుగకుండా కార్పోరేషన్ పరిధిలోని బిల్డర్లతో సమావేశం నిర్వహించి, అవగాహన కల్పిస్తామని ఆమె స్పష్టం చేశారు. రెక్కాడితే గాని డొక్కాడని నిరుపేద కూలీలు, కార్మికుల పక్షాన్నే నేను నిలబడి పోరాడుతానని మేయర్ లతాగౌడ్ వివరించారు.

వేసవి నీటి డిమాండ్‌పై జలమండలి అధికారులతో ఎండి, ఈడి సమీక్ష

హైదరాబాద్, జనవరి 9 ప్రభాతవార్త : వేసవిలో నీటి డిమాండ్‌ను ఎలా ఎదుర్కోవాలనే అంశంపై ఎండి అశోక్ రెడ్డి, ఈడి మయాంక్ మిట్టల్ జలమండలి అధికారులతో సమీక్ష నిర్వహించారు. గత వేసవిలో అధికంగా ట్యాంకర్లు బుక్ చేసుకున్న ప్రాంతాల అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ. గతే యేడాది ట్యాంకర్ బుకింగ్, నీటి సరఫరా, డెలివరీ తదితర వివరాలను పరిశీలించారు. ఈ సారినీటి డిమాండ్‌ను మరింత సమర్థంగా ఎదుర్కోవాలని సూచించారు. అందుకు అవసరమైన అన్ని సౌకర్యాలను సమకూరుస్తామని హామీ ఇచ్చారు. అవసరమైతే ట్యాంకర్లు, ఫిల్లింగ్ స్టేషన్లు, ఫిల్లింగ్ పాయింట్లు, నీటి మోతాదు పెంచుతామని తెలిపారు. గతంలో అధికంగా ట్యాంకర్లు బుక్‌చేసిన వినియోగదారులను సర్వేచేసి గుర్తించారు. వీరి ప్రాంగణాల్లో బోర్లు, భూగర్భ జలాలు ఎండిపోవడం వల్లే ఈ పరిస్థితి వచ్చిందని చెప్పారు. ఇలాంటి వినియోగదారుల ఇళ్లల్లో సర్వే చేపట్టామని తెలిపారు. ఇంకుడు గుంతలు నిర్మించుకునేలా అవగాహన కల్పించాలన్నారు. అనంతరం వారు ట్యాంకర్ల యజమానులతో సమావేశమయ్యారు. వేసవిలో ట్యాంకర్ల పరంగా ఎలాంటి ఇబ్బందులు రాకుండా కావాల్సిన అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. వారి నుంచి వినతులు స్వీకరించి వాటిని పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఈఎన్‌సి రెవెన్యూ డైరెక్టర్ వీఎల్. ప్రవీణ్ కుమార్, డైరెక్టర్ ఆపరేషన్స్-2 స్వామి, సిజిఎంలు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

హైదరాబాద్ వార్త

ఊరెళ్తున్నారా..ఇల్లు జాగ్రత్త!

- నగలు, విలువైన వస్తువులు, లాకర్లలో ఉంచాలంటున్న పోలీసులు
- ఇప్పటికే నగరంలోకి దొంగల ముఠాలు..!
- సమాచారం ఇస్తే గస్తీ ముమ్మరం
- అనుమానం వస్తే డయల్-100కు ఫోన్ చేయాలి

హైదరాబాద్, జనవరి 9 ప్రభాతవార్త సంక్రాంతి పండుగ వచ్చిందంటే చాలు..ఇప్పటికే దొంగల ముఠాల కళ్లన్నీ హైదరాబాద్‌పైనే ఉంటాయి. సంక్రాంతి పండుగను పురస్కరించుకుని ఊరికి వెళ్తున్న వారు అప్రమత్తంగా ఉండాలని పోలీసులు హెచ్చరిస్తున్నారు. పండుగ సెలవులతో చాలా మంది ప్రయాణాలు చేస్తారని, ఇదే అదనుగా దొంగలు చేతివాటం ప్రదర్శిస్తారని అంటున్నారు. సంక్రాంతి పండుగ దృష్ట్యా చోరీల నియంత్రణకు అన్ని చర్యలు చేపట్టినా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్నారు. రాత్రి వేళల్లో వీధుల్లో గస్తీ ఏర్పాటు చేస్తున్నామని పోలీసులు పేర్కొంటున్నారు. సంక్రాంతి, కనుమ తరువాత తిరిగి వస్తామంటూ మహానగరం పల్లె బాట పట్టింది. మూడు రోజుల సంక్రాంతి పండుగను నగర వాసులు సొంత ఊళ్ళలో వేడుకలను సంతోషంగా జరుపుకునేందుకు పెద్ద సంఖ్యలో తరలివెళుతున్నారు. శుక్రవారం నుండి సంక్రాంతి ప్రయాణాలు జోరుగా కొనసాగుతున్నాయి. విద్యార్థులకు పాఠశాలలు సెలవులు కావడంతో ఊళ్ళకు వెళ్ళేందుకు నగరంలో ప్రయాణికుల రద్దీ భారీగా పెరిగింది. పండుగ మరో మూడు రోజులే ఉండటంతో తెలుగు రాష్ట్రాల్లోని వివిధ ప్రాంతాలకు వెళ్ళేందుకు రైళ్ళు, ఆర్‌టిసి బస్సులు, ప్రైవేటు, స్వంత వాహనాలలో లక్షలాది మంది తరలివెళ్తున్నారు. ఈ నేపథ్యంలో ఊరు వెళ్ళే వారు అప్రమత్తంగా ఉండాలని పోలీసులు సూచిస్తున్నారు. పండుగకు ఊరెళ్ళి తిరిగి వచ్చే సరికి ఇల్లు గుల్ల కాకుండా చూసుకోవాల్సిన బాధ్యత మన మీదే ఉందనే విషయం ఎట్టి పరిస్థితుల్లోను మరవద్దని పోలీసులు సూచిస్తున్నారు.

సంక్రాంతికి ఊరెళ్లే వారికి పోలీసులు సూచనలు..

- సైబరాబాద్ కమిషనరేట్‌లో పోలీసులు నిఘా నేత్రం కింద ప్రజలు, కార్పొరేట్ కంపెనీల సిఎన్ ఆర్ సహకారంతో ఇప్పటికే సిసిటివీలను ఇన్‌స్టాల్ చేశారు. తద్వారా ఎన్నో సంచలనాత్మక నేరాలను ఛేదించారు. ప్రజలు తమ కాలనీలు, ఇళ్లు, పరిసరాలు, షాపింగ్ మాళ్లలో సిసి కెమెరాలు అమర్చుకోవాలి
- విలువైన వస్తువులను స్కూటర్ డిక్కీల్లో, కారులలో పెట్టడం చేయరాదు.
- ద్విచక్రవాహనాలు, కారులను ఇంటి ఆవరణలోనే పార్కింగ్ చేయాలి, రోడ్లపై నిలుపరాదు.
- బీరువా తాళాలను ఇంట్లో ఉంచరాదు. తమతో పాటే తీసుకెళ్లాలి.
- ఇంటికి తాళం వేసిన తర్వాత తాళం కనబడకుండా డోర్ కర్టెన్ వేయాలి.
- గ్రామాలకు వెళ్లే వారు ఇంట్లో ఏదో ఒక గదిలో లైటు వేసి ఉండాలి.
- ఎక్కువ రోజులు విహారయాత్రల్లో ఉంటే పేపర్, పాల వారిని రావద్దని చెప్పాలి.
- పని మనుషులు ఉంటే రోజూ వాకిలి ఊడ్చమని చెప్పాలి.
- విలువైన వస్తువుల సమాచారాన్ని, వ్యక్తిగత ఆర్థిక విషయాలను ఇతరులకు చెప్పకూడదు.
- విలువైన వస్తువుల సమాచారాన్ని ఇతరులకు చెప్పకూడదు.
- ఆరుబటయ వాహనాలకు హాండిల్ లాక్‌తో పాటు వీల్ లాక్ వేయాలి. వాచ్‌మెన్, సిసి కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి.
- ఇంట్లో బంగారు నగలు, నగదు ఉంటే వాటిని బ్యాంకు లాకర్లలో భద్రపరుచుకోవడం క్షేమం. లేదా ఎక్కువ రోజులు ఊళ్లకు వెళ్లేవారు విలువైన వస్తువులను వెంట తీసుకెళ్లాలి.
- టైమర్‌తో కూడిన లైట్లనుఇంట్లో అమర్చుకోవాలి.
- బ్యాగుల్లో బంగారు నగలు డబ్బు పెట్టుకొని ప్రయాణం చేస్తున్నప్పుడు బ్యాగులు దగ్గరలో పెట్టుకోవాలి. బ్యాగు బస్సులో పెట్టి కిందికి దిగితే దొంగలు అపహరిస్తారు.
- ఇంట్లో, ఇంటి బయట మోషన్ సెన్సర్‌లను ఉపయోగించడం మంచిది. ఇంటి బయట మోషన్ సెన్సర్ లైట్లను ఉపయోగించండి. ఇవి చీకటీ ఉన్నప్పుడు మాత్రమే పని చేస్తాయి. సెన్సార్లు పరిసరాల్లో ఏదైనా కదలిక గుర్తించగానే లైట్ వెలుగుతుంది.
- ప్రజలు తమ ప్రాంతంలో గస్తీ ఏర్పాటుకు సహకరించాలి. పోలీసుస్టేషన్ నెంబర్, వీధుల్లో వచ్చే బీట్ కానిస్టేబుల్ నెంబర్ దగ్గర పెట్టుకోవాలి. ప్రజలు నిరంతరం పోలీసులతో సమన్వయంగా సహకరిస్తే చోరీలను నియంత్రించడం చాలా సులభం.
- అనుమానిత వ్యక్తుల కదలికలను గమనించి, పోలీసులకు సమాచారం ఇవ్వాలి.
- ఇళ్లకు తాళాలు వేసి ఊర్లకు వెళ్లేటప్పుడు చుట్టు పక్కల వారికి లేదా స్థానిక పోలీస్‌స్టేషన్‌కు సమాచారం అందించాలి.
- నమ్మకమైన సెక్యూరిటీ గార్డులను, వాచ్ మెన్‌ను నియమించుకోవాలి.
- దూర ప్రాంతాలకు వెళ్లేవారు తమ ఇంటి చిరునామా, ఫోన్ నెంబర్‌ను సంబంధిత పోలీసు స్టేషన్ అధికారులకు తెలపాలి. దీంతో వారి వివరాలను రిజిస్టర్‌లో నమోదు చేసుకుని ఊరెళ్లిన వారి ఇళ్లపై నిఘాను ఏర్పాటు చేస్తారు.
- కాలనీలో దొంగతనాల నివారణకు స్వచ్ఛందంగా కమిటీలను నిర్వహించుకోవాలి. ఈ కమిటీ సభ్యులు ఎప్పటికప్పుడు పోలీసులకు అందుబాటులో ఉంటూ అనుమానాస్పద, కొత్త వ్యక్తుల కదలికలపై 100 డయల్‌కు సమాచారం ఇవ్వాలి.

ఆగిపోయిన డబుల్ బెడ్ రూమ్ నిర్మాణానికి సహకరించాలి

- వి.పి. గౌతమ్

-ప్రతి ఒక్కరికి సొంత ఇల్లు ఉండాలనేది మనందరి కల

మెహిదీపట్నం, జనవరి 9, ప్రభాతవార్త : బోజగుట్టలో ఆగిపోయిన డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల నిర్మాణలు చేపట్టేందుకు అందరూ సహకరించాలని గృహ నిర్మాణ శాఖ మేనేజింగ్ డైరెక్టర్ వీపీ గౌతమ్ ప్రజలను కోరారు. గురువారం ఆసిఫ్ నగర్ మండలం బోజగుట్టలో ఆగిపోయిన డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను హైదరాబాద్ జిల్లా కలెక్టర్ దురిశెట్టి అనుదీప్ తో కలిసి పరిశీలించారు. అనంతరం వివేకానంద నగర్, శ్రీరామ్ నగర్, శివాజీ నగర్ కాలనీవాసులతో పెండింగ్ లో ఉన్న డబుల్ బెడ్ రూమ్ సమస్యలు, ఇబ్బందులు, కాలనీవాసుల అభిప్రాయాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా విపి గౌతమ్ మాట్లాడుతూ... భోజగుట్ట లో నివసిస్తున్న 500 మంది తమ ఇండ్లను ఖాళీ చేశారని, 200 మంది ఇంకా ఖాళీ చేయలేదని, కొందరు కోర్టుకు వెళ్లారని తెలిపారు. పేదలకు ఉండడానికి మంచి సదుపాయాలతో ఒక గూడు కల్పించాలని ఉద్దేశంతో వచ్చామని భోజగుట్ట ప్రజలందరూ సహకరించాలని కోరారు. పేదలకు మంచి కాలనీ నిర్మించి ఇవ్వాలనే ఉద్దేశంతో ప్రభుత్వం 200506లో బోజగుట్టలో డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల నిర్మాణాలు చేపట్టిందని, నాలుగేళ్లలో 20 లక్షల ఇండ్లు పేదలకు ఇస్తామని ప్రభుత్వం ప్రకటించింది అన్నారు. రాష్ట్రంలో 10 లక్షల కుటుంబాలు ఇండ్లు కావాలని దరఖాస్తు పెట్టుకున్నారని, ఇంతమందికి స్థలం లేకపోవడం, హైదరాబాదులో భూమి విలువ అత్యధికంగా ఉండడంతో చాలా మంది ఫ్లాట్స్ కొనుగోలు చేసుకుంటున్నారని గుర్తు చేశారు. కొల్లూరులో పదహారువేల ఇండ్లు ఇచ్చామని అందులో 6000 కుటుంబాలు నివసిస్తున్నాయని తెలిపారు. ప్రతి ఒక్కరికి సొంత ఇల్లు ఉండాలని మనందరి కల

సమావేశంలో పాల్గొన్న విపి గౌతమ్, కలెక్టర్.

అన్నారు. బొజగుట్టలో మంచి బడి, కమ్యూనిటీ హాల్, క్రీడాస్థలం, అంగన్వాడి కేంద్రం, మెరుగైన సౌకర్యాలు ఆగిపోయిన డబుల్ బెడ్ రూమ్ ల కోసం ప్రభుత్వానికి నివేదిస్తామని తెలిపారు. అనంతరం హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ...బోజగుట్టలో ఎవరికి ఇబ్బంది కలగకుండా సమస్యను పరిష్కారం చేస్తామని హామీ ఇచ్చారు. వివేకానంద నగర్, శ్రీరామ్ నగర్, శివాజీ నగర్ కాలనీవాసులు అందరూ కలిసి సమస్య పరిష్కారానికి సహకరించాలని కోరారు. డబుల్ బెడ్ రూమ్ కాలనీలోని పిల్లల కోసం మంచి పాఠశాల, ఆసుపత్రి, అంగన్వాడి కేంద్రం, కమ్యూనిటీ కేంద్రం, డ్రైనేజ్, స్వచ్ఛమైన నీరు, మెరుగైన సౌకర్యాలు కల్పించాలనే ఉద్దేశంతో వచ్చామని, సమస్య పరిష్కారం వైపు ఆలోచించాలని ప్రజలను కోరారు. సమావేశంలో డిఆర్ఓ ఈ.వెంకటాచారి, పురాణ నిర్మాణ శాఖ ఎస్ ఈ, ఆర్డీవో రామకృష్ణ, తాసిల్దార్ జ్యోతి, కాంగ్రెస్ పార్టీ కార్వా నియోజకవర్గ నాయకులు నాగారం వేణు గౌడ్, జిహెచ్ఎంసి అధికారులు, వివేకానంద నగర్, శ్రీరామ్ నగర్, శివాజీ నగర్ కాలనీవాసులు స్థానిక నేతలు పాల్గొన్నారు.

నగరం నుండి సంక్రాంతికి స్పెషల్ బస్సులు

-ఉప్పల్ క్రాస్ రోడ్స్, ఆరాంఘర్, ఎల్బీనగర్, కూకట్‌పల్లి నుంచి స్వల్ప పెరుగుదల టికెట్ చార్జీలతో ప్రత్యేక బస్సులు

హైదరాబాద్, జనవరి 9 ప్రభాతవార్త : నగరంలోని పలు ప్రాంతాల నఉంచి సంక్రాంతి స్పెషల్ బస్సులు బయల్దేరబోతున్నాయ్.ఎంజీబీఎస్, జేబీఎస్ నుంచే కాకుండా శివారు ప్రాంతాల నుండి సంక్రాంతికి స్పెషల్ బస్సులు నడిపేందుకు టీజీఎస్ఆర్టీసీ సన్నద్ధమైంది.సంక్రాంతి పండుగ సందర్భంగా సొంతూళ్లకు వెళ్లే వారిని క్షేమంగా గమ్య స్థానాలకు చేర్చేందుకు టీజీఎస్ఆర్టీసీ తగిన ఏర్పాట్లు చేసింది. ఈ సంక్రాంతి పండుగకు 6432 ప్రత్యేక బస్సులను నడపాలని ఆర్టీసీ నిర్ణయించింది. ప్రధానంగా ఈ నెల 10, 11, 12 తేదీల్లో ప్రయాణికుల రద్దీ ఎక్కువగా ఉండే అవకాశం ఉంది. అందుకే ఆ రోజుల్లో ప్రయాణికుల రద్దీకి తగ్గట్టుగా ప్రత్యేక బస్సులను అందుబాటులో ఉంచేలా ప్లాన్ చేసింది. అలాగే సంక్రాంతి పండుగకు సొంతూళ్లు వెళ్లిన వాళ్లు ఈ నెల 19, 20 తేదీల్లో తిరిగి వచ్చే అవకాశం ఉండటంతో అందుకు తగిన విధంగా కూడా బస్సులను నడపాలని ఆర్టీసీ భావిస్తోంది. హైదరాబాద్ రద్దీ ప్రాంతాలైన ఎంజీబీఎస్, జేబీఎస్, ఉప్పల్ క్రాస్ రోడ్స్, ఆరాంఘర్, ఎల్బీనగర్ క్రాస్ రోడ్స్, కూకట్‌పల్లి హౌసింగ్ బోర్డు కాలనీ, బోయిన్ పల్లి, గచ్చిబౌలి, తదితర ప్రాంతాల నుంచి ప్రత్యేక బస్సులను ఆర్టీసీ నడుపుతోంది. సంక్రాంతి పండుగకు నడిపే ప్రత్యేక బస్సులకు రాష్ట్ర ప్రభుత్వ జీవో ప్రకారం టికెట్ ధరలను స్వల్పంగా పెంచుకునేలా టీజీఎస్ఆర్టీసీ యాజమాన్యం సవరించింది. తెలంగాణతో పాటు ఇతర రాష్ట్రాలకు తిరిగే స్పెషల్ బస్సులకు మాత్రమే సవరించిన చార్జీలు వర్తిస్తాయి. ఈ నెల 10, 11, 12 తేదీలతో పాటు తిరుగు ప్రయాణ రద్దీ ఎక్కువగా ఉండే 19, 20 తేదీల్లో మాత్రమే సవరించిన చార్జీలు అమల్లో ఉంటాయి స్పెషల్ బస్సుల మినహా రెగ్యులర్ బస్సుల్లో సాధారణ ఛార్జీలే అమల్లో ఉంటాయని టీజీఎస్ఆర్టీసీ వివరణ ఇచ్చింది. రాష్ట్ర ప్రభుత్వ మహాలక్ష్మీ పథకంలో భాగంగా సంక్రాంతికి నడిపే పల్లె వెలుగు, ఎక్స్‌ప్రెస్, సిటీ ఆర్డినరి, మెట్రో ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో మహిళలకు ఉచిత బస్సు రవాణా సదుపాయం యథావిధిగా అమల్లో ఉంటుంది. రాష్ట్ర ప్రభుత్వ జీవో ప్రకారం ఈ సంక్రాంతికి కేవలం 5 రోజులు పాటు టికెట్ ధరలను ఆర్టీసీ సవరించింది.

చిక్కడపల్లి శ్రీవారి ఆలయంలో ఏర్పాట్లను పరిశీలించిన ఇంచార్జ్ డిసిపి

బందోబస్తు ఏర్పాట్లను పరిశీలిస్తున్న సెంట్రల్ జోన్ ఇంచార్జ్ డీసీపీ కోగంటి శిల్పావలి

చిక్కడపల్లి, జనవరి 9 ప్రభాతవార్త: చిక్కడపల్లి శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయంలో జరిగే వైకుంఠ ద్వారదర్శనం సందర్భంగా అక్కడ బందోబస్తు ఏర్పాట్లను సెంట్రల్ జోన్ ఇంచార్జ్ డీసీపీ కోగంటి శిల్పావలి గురువారం సాయంత్రం పరిశీలించారు. అదనపు డీసీపీ ఆనంద్, చిక్కడపల్లి ఏసీపీ ఎల్.రమేశ్‌కుమార్, సెంట్రల్ జోన్ ట్రాఫిక్ ఏసీపీ ఎర్నా, చిక్కడపల్లి ఇన్‌స్పెక్టర్ రాజూనాయక్‌లతో కలిసి పరిశీలించారు. గతంలో ఏ విధంగానైతే ఉత్సవాలకు బందోబస్తు ఏర్పాటు చేశారో అదే తరహాలో ఏర్పాటు చేయడంతో పాటు గతంలో జరిగిన అనుభవాలను దృష్టిలో ఉంచుకుని బందోబస్తు ఉండాలని సూచించారు. క్యూ లైన్‌లను ఏర్పాటు చేయడంతో పాటు ఆలయం వద్ద ఏర్పాట్లను సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. అదే విధంగా ఆలయం ప్రాంగణంలో జరుగుతున్న ఏర్పాట్లను, సీసీ కెమెరాల ఏర్పాటు, ఇతర ఏర్పాట్లను అడిగి తెలుసుకున్నారు. ట్రాఫిక్ విషయంలో ప్రత్యేక చర్యలు తీసుకోవడంతో పాటు పార్కింగ్‌కు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని ట్రాఫిక్ పోలీసులకు సూచనలు చేశారు. తిరుపతిలో జరిగిన తొక్కిసలాటను దృష్టిలో ఉంచుకుని ముందుజాగ్రత్త చర్యలలో భాగంగా బందోబస్తు చర్యలకు చేపడుతున్నారు.

తార్నాక డివిజన్ బిజెపి అధ్యక్షుడుగా ఉపేందర్ యాదవ్

తార్నాక, జనవరి 9 ప్రభాతవార్త: తార్నాక డివిజన్ బీజేపి నూతన అధ్యక్షుడుగా లాలాపేట్‌కు చెందిన సీనియర్ నాయకులు బండారి ఉపేందర్ యాదవ్ నియమితులయ్యారు. ఈ మేరకు జిల్లా రిటర్నింగ్ ఆఫీసర్ మాదవరం కాంతారావు నియామకపు పత్రాన్ని అందజేశారు. ఉపేందర్ యాదవ్ గతంలో తార్నాక డివిజన్ యువమోర్చ అధ్యక్షుడిగా ఇతర పదవుల్లో కొనసాగారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనను నియమించేందుకు కృషి చేసిన కేంద్ర మంత్రి,రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డి, మాజీ మేయర్ బండకార్తికరెడ్డి, సికింద్రాబాద్ జిల్లా అధ్యక్షులు శ్యామ్ సుందర్ గౌడ్ తధితరులకు కృతజ్ఞతలన్నారు. పార్టీ బలోపేతానికి అందరితో కలిసి పనిచేస్తానని ఉపేందర్ యాదవ్ చెప్పారు.

ఏప్రిల్‌లో మిస్, మిసెస్, రాయల్ మిస్టర్ ఇండియా పోటీలు

పోటీల పోస్టర్ ఆవిష్కరిస్తున్న దృశ్యం

హైదరాబాద్, జనవరి 9, ప్రభాతవార్త:

హైదరాబాద్ వేదికగా గ్లోరియస్ మిస్, మిసెస్, రాయల్ మిస్టర్ ఇండియా పోటీలు ఏప్రిల్ మాసంలో నిర్వహిస్తున్నట్లు సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా పబ్లిక్ రిలేషన్స్ అధికారి అజయ్ కుమార్ అగర్వాల్ తెలిపారు. సోమాజిగూడ ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన సమావేశంలో జె సి ఐ,షిమెరింగ్ స్టార్ లైట్ క్రియేషన్స్ ప్రతినిధులు స్నేహాల్, క్రాంతి కుమార్ పాల్వాయి, సబీనా, నిరూప పటేల్ లతో కలిసి పోటీలకు సంబందించిన పోస్టర్ ను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జె సి ఐ,షిమెరింగ్ స్టార్ లైట్ క్రియేషన్స్ ల సంయుక్త ఆధ్వర్యంలో ఏప్రిల్ మాసంలో ఈ పోటీలు ప్రతిష్టాత్మకంగా పార్క్ హోటల్ లో నిర్వహిస్తున్నట్లు, ఇప్పటికే ఈ పోటీలకు సంబందించిన ఆన్ లైన్ రిజిస్ట్రేషన్లు ప్రారంభం అయ్యాయని, ఈ పోటీల ద్వారా సమీకరించే నిధులను సామాజిక సేవా కార్యక్రమాలకు వినియోస్తున్నట్లు తెలిపారు .

ముషీరాబాద్ వర్కింగ్ జర్నలిస్ట్స్ అసోసియేషన్‌కు నూతన కమిటీ

ముషీరాబాద్ వర్కింగ్ జర్నలిస్ట్స్ అసోసియేషన్ నూతన కమిటీ

ముషీరాబాద్, జనవరి 9, ప్రభాతవార్త: ముషీరాబాద్ వర్కింగ్ జర్నలిస్ట్స్ అసోసియేషన్ నూతన కమిటీ ఏకగ్రీవంగా ఎన్నికయింది. గురువారం రాంనగర్‌లోని రాజ్‌ఫంక్షన్‌హాల్ నందు అసోసియేషన్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సమావేశంలో ముందుగా ఇటీవల మరణించిన సీనియర్ పాత్రికేయులు భీంరావ్ యాదవ్‌కు అసోసియేషన్ తరఫున మౌనం పాటించి, నివాళులర్పించారు. అనంతరం నూతన కమిటీ ఎన్నిక నిర్వహించారు. అసోసియేషన్ అధ్యక్షునిగా బొల్లం శ్రీనివాస్ (ఆంధ్రజ్యోతి), ప్రధాన కార్యదర్శిగా సీహెచ్.వీరారెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ గా సి.శివకుమార్, కోశాధికారిగా కే.నర్సింహ, ముఖ్య సలహాదారులుగా పి.నాగవాణి, ప్రచార కార్యదర్శిగా జీవన్‌రెడ్డి, ఉపాధ్యక్షులుగా బి.కనకరాజు, ఎం.జహంగీర్, రామగిరి భీష్మాచారి, కార్యదర్శులుగా బి.సతీష్, సి.అఖిలేష్, బి.మనోహం, సభ్యులుగా ప్రేమ్‌సాగర్, రామ్‌రెడ్డి, బాలకృష్ణ, సంపత్, జి.శ్రీనివాస్ , శ్రీధర్, రహీం, వేణుగోపాల్ నియమితులయ్యారు. అనంతరం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాట్లాడుతూ నూతన కమిటీ రెండు సంవత్సరాల పాటు కొనసాగుతుందని తెలిపారు. జర్నలిస్టుల సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ముందుకు వెళ్తామని తెలిపారు.

వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో తిరుపతి రావు ప్రతిభ

తిరుపతిరావును అభినందిస్తున్న నియోజకవర్గం మైనారిటీ సెల్ అధ్యక్షులు మహ్మద్ గౌసుద్దీన్.

యూసుఫ్‌గూడ, జనవరి 9, ప్రభాతవార్త:

వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో అల్లాపూర్ డివిజన్ పరిధిలోని పర్వత్‌నగర్‌కు చెందిన ఈ.తిరుపతిరావు ప్రతిభకనపర్చి బంగారు పథకాన్ని సాధించాడు. ఇందుకుగాను గురువారం మైనారిటీ సెల్ అధ్యక్షులు మహ్మద్ గౌసుద్దీన్ ప్రత్యేకంగా సన్మానించి అభినందించారు. ఈ సందర్భంగా తిరుపతిరావు మాట్లాడుతూ తనకు ప్రభుత్వం సహాయ సహకారాలు అందిస్తే దేశస్థాయిలోనే కాకుండా వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో మరింత గుర్తింపు తీసుకురావడానికి సాయశక్తులా కృషి చేస్తానన్నారు. ఇప్పటి వరకు తనకు సహాయ సహకారాలు అందించిన ప్రతిఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. అదే విధంగా గాయిత్రినగర్‌కు చెందిన అరవింద్ తిరుపతిరావుకు రూ. 25 వేలు ఆర్థిక సాయాన్ని అందించి తన వంతుగా ప్రోత్సాహాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో పర్వతనగర్ సంక్షేమసంఘం అధ్యక్షులు జాహేద్ షరీఫ్, ప్రసాద్, మొగలిరాజు, రామయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

కన్నులపండువ ధనుర్మాస దీపోత్సవం

దీపకాంతుల్లో కళ్లు మిరిమిట్లు గొల్పుతున్న దీపోత్సవం

నాంపల్లి, జనవరి 9 ప్రభాతవార్త : తెలంగాణ రాష్ట్ర దేవాదాయ, ధర్మాదాయశాఖ ఆధ్వర్యంలో ఎస్‌బిహెచ్ కాలనీ గాంధీనగర్‌లో కొలువైన ఉన్న అతిపురాతన శ్రీ సంగమేశ్వరస్వామి, శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయంలో 16 నుండి నిర్విరామంగా జరుగుతున్న ధనుర్మాస మహోత్సవాలు వందలాదిమంది భక్తుల భక్తిప్రపత్తులు ఆధ్యాత్మికశోభతో 14 జనవరి 2025 వరకు నెలరోజుల పాటు ధనుర్మాస (తిరుప్పావై) మహోత్సవాలు అత్యంత వైభవంగా శ్రీ పాంచరాత్రాగమానుసారంగా, వైష్ణవ సంప్రదాయం ప్రకారం నేత్రపర్వంగా జరుగుతున్నాయి. ఈ నెలరోజులపాటు జరిగే ధనుర్మాస విశేష కైంకర్యములు (ప్రత్యేక పూజలు)లో భాగంగా రాత్రి 7గంటల నుండి దీపోత్సవం కన్నులపండువగా జరిగింది. అధికసంఖ్యలో మహిళా, చిన్నారి భక్తులు ఆలయ ప్రాంగణంలో శ్రీవేంకటేశ్వరస్వామి గోవిందనామాలను ఆలపిస్తూ దీపాలను శంఖు చక్ర, తిరునామా రూపంలో అత్యంత సుందరంగా వెలిగించి ఆధ్యాత్మికశోభను గుభాళింపజేశారు. నేడు వైకుంఠ (ముక్కోటి) ఏకాదశి పర్వదినం సందర్భంగా ఉదయం 3గంటల నుండి శ్రీ అలిమేలు మంగా, పద్మావతి సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి వారికి అభిషేకము 5.30 నుండి ఉత్తరద్వార దర్శనం, 6 నుండి అఖండ గోవిందనామ సంకీర్తన, విశేష పుష్పాలంకరణ, వైకుంఠ రంగనాథుడి అలంకారం, వెండి పుష్పార్చణ ప్రత్యేక పూజాకార్యక్రమాలు ఉంటాయని ఆలయ కార్యనిర్వహణాధికారి పి.లక్ష్మారెడ్డి తెలిపారు.

విద్యార్థులు సమయాన్ని వృధా చేయకుండా లక్ష్యాన్ని సాధించడానికి కృషి చేయాలి

జ్యోతిని వెలిగిస్తున్న అవంతి గ్రూప్ ఆఫ్ ఇన్స్టిట్యూషన్స్ వ్యవస్థాపకులు ఎం. శ్రీనివాసరావు

హైదరాబాద్ జనవరి 9 ప్రభాతవార్త: ఉస్మానియా విశ్వవిద్యాలయం కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్ అధిపతి ప్రొఫెసర్ పి.వి. సుధ అన్నారు. గురువారం నారాయణ గూడలోని తాజ్ మహల్ హోటల్‌లో అవంతి పీజీ కళాశాలలోని ఎంబిఎ, ఎంసిఎ సీనియర్లు ప్రారంభించిన "ఆరంభ్ 225" కార్యక్రమం జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన పి.వి. సుధ మాట్లాడుతూ సమయాన్ని ఉత్పాదకంగా ఉపయోగించుకోవడం ప్రస్తుతం అన్ని రంగాలలో అవకాశాలు మెండుగా ఉన్నాయని, పరిశ్రమలో అవకాశాలను సద్వినియోగం చేసుకోవడానికి పాఠ్యాంశాలు కోర్ స్థాయిలో నేర్చుకోవడానికి అనుకూలంగా ఉంటాయని అన్నారు. అవంతి గ్రూప్ ఆఫ్ ఇన్స్టిట్యూషన్స్ వ్యవస్థాపకులు ఎం. శ్రీనివాసరావు మాట్లాడుతూ విద్యార్థులు అవకాశాలను అందిపుచ్చుకుని జీవితంలో స్థిరపడాలని అన్నారు. ఎల్లప్పుడూ సానుకూల దృక్పథంతో ఉంటూ దేశాభివృద్ధికి నేర్చుకున్న జ్ఞానాన్ని, బలాన్ని సంపాదించుకుని యజమానులుగా మారాలని ఆకాంక్షించారు. అవంతి గ్రూప్ ఆఫ్ కాలేజీ డైరెక్టర్ డాక్టర్ వై జయప్రద, అవంతి పీజీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్ అప్పారావు, విప్రో గ్లోబల్ కాంపిటెన్సీ అండ్ డెలివరీ హెడ్‌సర్వీస్ పవన్ కుమార్ గోదావరి ప్రసంగించారు. ఇదే సభలో టాక్స్ మెంటర్ డైరెక్టర్ పి.ఎస్. నాగరాజు మాట్లాడుతూ విజయం సాధించి, ఆ వ్యక్తి తమను తాము గుర్తించుకుని, ఈ లైనర్ బలాలను పొందాలనే . లక్ష్యాన్ని సాధించడానికి విద్యార్థులు విద్యా, కెరీర్‌పై దృష్టి పెట్టాలని అన్నారు. , బీలీతి హైదరాబాద్ చాప్టర్ అధ్యక్షుడు కె. చంద్ర శేఖర్ ప్రసంగించారు.

సంక్రాంతికి ఊరెళ్తున్నారా....పోలీస్‌స్టేషన్‌లో సమాచారం ఇవ్వండి

-బేగంపేట ఎసిపి గోపాల కృష్ణ మూర్తి

బేగంపేట జనవరి 9,ప్రభాతవార్త

సంక్రాంతి పండుగకు మీరు ఊరెళ్తున్నారా అయితే చాలా జాగ్రత్తగా ఉండాలని హెచ్చరిస్తున్నారు పోలీసులు. దొంగలు తాళం వేసి ఉన్న ఇళ్లను టార్గెట్ చేసుకుని దొంగతనాలకు పాల్పడే అవకాశం ఉందని,దీన్ని దృష్టిలో ఉంచుకొని సంక్రాంతికి ఊరెళ్లేవారు వారి వివరాలను స్థానిక పోలీసుస్టేషన్‌లో సమాచారం ఇవ్వాలని బేగంపేట ఏసీపీ గోపాల కృష్ణమూర్తి హెచ్చరించారు.ఇప్పటికే బేగంపేట డివిజన్ పరిధిలో ఈ విషయంపై అప్రమత్తం చేసామన్నారు.బంగారం,వెండీ ఆభరణాలు,నగదు,విలువైన వస్తువులను బ్యాంకు లాకర్లలో జమ చేసుకోవాలన్నారు.ప్రధాన ద్వారాలకు సెంట్రల్ లాక్ సిస్టమ్‌తో పాటు సెక్యూరిటీ అలారం ,మోషన్ సెన్సార్లు ఏర్పాటు చేసుకోవాలన్నారు.ఊరెళ్లే ముందు స్థానిక పోలీస్‌స్టేషన్లలో సమాచారం ఇస్తే నిఘా ఉంటుందన్నారు.అనుమానాస్పద వ్యక్తులు,వాహనాలను గమనించినట్లైతే వారి సమాచారాన్ని డయల్ 100కు గానీ పోలీసులకు గానీ సమాచారం ఇవ్వాలన్నారు.వాహనాలను ఇంటి ఆవరణలో పార్కింగ్ చేసుకోవాలని,నమ్మకమైన కాపలాదారులను నియమించుకోవడంతోపాటు వారి ఆధార్‌తో పాటు పూర్తి వివరాలను తీసుకోవాలన్నారు.సీసీ కెమెరాల పుటేజ్‌లను తరచూ ఆన్‌లైన్‌లో చెక్ చేసుకోవాలన్నారు.ప్రయాణంలో బస్సులు ,రైళ్లు,ఆటోల్లో జనం ఉంటారు కాబట్టి గొల్సు,చోరీలు అవుతాయన్నారు.ప్రధాన ద్వారానికి వేసిన తాళాలు కనిపించకుండా కర్టెన్స్ వేయాలన్నారు.ప్రధాన ద్వారం పక్కన ఉన్న కిటికీలతో పాటు మిగతా గదుల కిటికీల తలుపులు మూసేయాలన్నారు.పేపర్లు,పాలప్యాకెట్లు ఇంటి ముందు వేయవద్దని చెప్పాలన్నారు.వీలైతే వచ్చేదాకా ఆపేయాలన్నారు.ఇళ్లు బీరువాల తాళాలు పనిమనుషులు, కాపలాదారులకు ఇవ్వొద్దన్నారు.

ద్విచక్రవాహనాలకు పకడ్బందీగా తాళాలు వేయాలన్నారు.అశ్రద్ధగా ఉండవద్దన్నారు. జనావాసాల్లో గట్టి నిఘా పెడుతున్నాం.సిబ్బందిని బృందాలుగా ఏర్పాటు చేసి ప్యాట్రోలింగ్ పెంచనున్నట్లు ఏసీపీ తెలిపారు.పోలీసుల జాగ్రత్తలు పాటించి క్షేమంగా ఊళ్లకు వెళ్లవచ్చన్నారు.

నూతన డివిజన్ అధ్యక్షులను నియమించిన బిజెపి

హైదరాబాద్, జనవరి 9, ప్రభాతవార్త: హైదరాబాద్ సెంట్రల్ జిల్లాలోని డివిజన్ అధ్యక్షులను బీజేపీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా రిటర్నింగ్ అధికారి జే.శ్రీకాంత్ గురువారం ప్రకటించారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గంలోని షేక్‌పేట్ డివిజన్ అధ్యక్షులుగా పూసరాకేష్, జిల్లా కౌన్సిల్ సభ్యులుగా జి.శివకుమార్ నియమితులవగా, యూసఫ్‌గూడ డివిజన్ అధ్యక్షులుగా బి.రాజశేఖర్, జిల్లా కౌన్సిల్ సభ్యునిగా కే.చంద్రమోహన్, వెంటళరావ్‌నగర్ డివిజన్ అధ్యక్షునిగా నవీన్‌కుమార్, కౌన్సిల్ సభ్యునిగా ఎన్.విజయ్‌కుమార్, ఎర్రగడ్డ అధ్యక్షునిగా బొట్ల విజయ్‌కుమార్, కౌన్సిల్ సభ్యునిగా ఎదులకంటి రాజేష్, రహమత్‌నగర్ అధ్యక్షునిగా తంగెళ్లపల్లి లక్ష్మణ్, కౌన్సిల్ సభ్యునిగా సంగు కనకరాజ్, బోరబండ అధ్యక్షునిగా కొత్త వెంకటేశం, కౌన్సిల్ సభ్యునిగా శ్రవణ్‌రెడ్డి పూజారి నియమితులయ్యారు. అదే విధంగా ఖైరతాబాద్ నియోజకవర్గంలోని జూబ్లీహిల్స్ డివిజన్ అధ్యక్షునిగా ముద్దంగుల శ్రీనివాస్, కౌన్సిల్ సభ్యునిగా ఎస్.అనిల్‌కుమార్, ఖైరతాబాద్ డివిజన్ అధ్యక్షునిగా ఏ.ఆదర్శ వంశీకర్ , కౌన్సిల్ సభ్యునిగా నర్సింహ గౌడ్, సోమాజిగూడ డివిజన్ అధ్యక్షునిగా గొల్లపల్లి సూర్య వినాయక్, కౌన్సిల్ సభ్యునిగా వేణు, వెంకటేశ్వర కాలనీ డివిజన్ అధ్యక్షునిగా చెట్టపల్లి విజయ్‌కుమార్, కౌన్సిల్ సభ్యునిగా సర్వోత్తం రెడ్డి, బంజారాహిల్స్ అధ్యక్షునిగా ఏ.వినయ్‌ముదిరాజ్, కౌన్సిల్ సభ్యునిగా శ్రీకాంత్ యాదవ్ నియమితులయ్యారు. నాంపల్లి నియోజకవర్గం లోని ఆసిఫ్‌నగర్ డివిజన్ అధ్యక్షునిగా సీహెచ్. ముఖేష్, కౌన్సిల్ సభ్యునిగా బి.ఐలయ్య, విజయనగర్ కాలనీ డివిజన్ అధ్యక్షునిగా డి.ఆనంద్‌రావు, కౌన్సిల్ సభ్యునిగా జే.శశికాంత్, అహ్మద్‌నగర్ డివిజన్ అధ్యక్షునిగా కే.వినోద్‌కుమార్, కౌన్సిల్ సభ్యునిగా కే.శేఖర్, రెడ్‌హిల్స్ డివిజన్ అధ్యక్షునిగా ధరంసింగ్, కౌన్సిల్ సభ్యునిగా కొల్లూరు క్రాంతి, గుడిమల్కాపూర్ డివిజన్ అధ్యక్షునిగా దేవర వంశీని, కౌన్సిల్ సభ్యునిగా ధీరజ్‌ను నియామకం చేసినట్లు ప్రకటించారు. ఈ సందర్భంగా జే.శ్రీకాంత్ మాట్లాడుతూ రాబోయే రోజుల్లో భాజపాను బలోపేతం చేసేందుకు నూతన అధ్యక్షులు, కౌన్సిల్ సభ్యులు కృషి చేస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు.

కౌటికె విఠల్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు

కార్యక్రమంలో పాల్గొన్న చందా నరసింహారావు, శ్రీనివాసరావు, కౌటికె విఠల్ తదితరులు

చిక్కడపల్లి, జనవరి 9 ప్రభాతవార్త: ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ జాతీయ సలహాదారులు, ఆలిండియా సిఎల్ఐఏ చైర్మన్, జాతీయ సలహాదారు కౌటికె విఠల్ ఆధ్వర్యంలో గురువారం ఏర్పాటు చేసిన సేవా కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రముఖ పారిశ్రామికవేత్త, వరల్డ్ ఆర్యవైశ్య మహాసభ జాతీయ నేత చందా నరసింహారావు హాజరై అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించి ప్రసంగించారు. ఇదే సభలో వెయ్యి మంది పేదలకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గౌరవ అతిథులుగా సంఘసేవకులు చందా చిన్న శ్రీనివాస్, ప్రపంచ ఆర్యవైశ్య మహాసభసీనియర్ సిటిజన్స్ ఫోరం ప్రధాన కార్యదర్శి పి.వి.రమణయ్య, అవోపా ప్రధాన కార్యదర్శి రవిగుప్త, కౌటికె ఆదిత్య తదితరులు పాల్గొన్నారు. ప్రముఖ పారిశ్రామికవేత్త శ్రీనివాస్‌రావు జన్మదినోత్సవం సందర్భంగా అభినందన సత్కార కార్యక్రమం కౌటికె విఠల్ ఆధ్వర్యంలో జరిగింది. ప్రఖ్యాత భారతీయ జీవిత బీమా ఏజెంట్ కౌటికె విఠల్ తన పాలసీదారుల పట్ల గౌరవాన్ని చూపుతూ, వారి జన్మదినోత్సవాలను ప్రత్యేకమైన సామాజిక కార్యక్రమాలతో జరిపే పద్ధతిని అలవాటు చేసుకున్నారు. ఈ రోజు, తన సమీప పాలసీదారులలో ఒకరైన చందా శ్రీనివాసరావు జన్మదినోత్సవాన్ని 1000 మందికి సహపంక్తి భోజనాల నిర్వహణతో అత్యంత ఘనంగా జరిపారు.

డేంజర్‌బెల్స్ డ్రైవింగ్‌లో సెల్ ముచ్చట్లు తప్పవు నరకానికి మెట్లు

మురుగు నీటి శుద్ధికి సరికొత్త ప్రక్రియ

- ఓయూ రిటైర్డ్ ప్రొఫెసర్ వెంకటేశ్వర్

మురికినీరు శుద్ధిచేసే విధానాన్ని వివరిస్తున్న ప్రొ. వెంకటేశ్వర్

హైదరాబాద్, జనవరి 6,ప్రభాతవార్త:

మురుగు నీటిని శుద్ధి చేయడానికి అత్యంత తక్కువ ఖర్చుతో సరికొత్త ప్రక్రియకు శ్రీకారం చుట్టినట్లు ప్రొఫెసర్ సి.వెంకటేశ్వర్ తెలిపారు. గురువారం సోమాజిగూడ ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉస్మానియా యూనివర్సిటీ లో ప్రొఫెసర్‌గా పనిచేసిన తాను మురుగు నీటి నాలాల మరమ్మత్తు, శుద్ధి చేయడం కోసం చాలా ఏళ్లుగా పరిశోధన చేశానని, అత్యంత తక్కువ ఖర్చు తో మురుగు నీటిని శుద్ధి చేయడం కోసం నూతన ప్రక్రియను తాను పరీక్షించినట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా తాను చేసిన పరిశోధన గురించి నీటిని ఎలా శుద్ధి చేయగలమో ఆయన ప్రత్యక్షంగా వివరించారు. తెలంగాణ ప్రభుత్వం ప్రస్తుతం హుస్సేన్ సాగర్ ప్రక్షాళనకు శ్రీకారం చుట్టిందని, తన పరిశోధన వారికి ఉపయోగకరంగా ఉంటుందన్న ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. తన పరిశోధన కు సివిఆర్ అన్న పేరు పెట్టానని, అదే పేరుతో పేటెంట్ కూడా తీసుకున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయనతో పాటుసాల్మన్ రాజు,అరవింద్ తదితరులు పాల్గొన్నారు.

వివాహిత అదృశ్యం..

జీడిమెట్ల, జనవరి 9, ప్రభాతవార్త : ఓ వివాహిత అదృశ్యమైన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఈ ఘటన సూరారం పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం జిల్లెల్ల రెడ్డిబాబు అతని భార్య చిత్రశ్రీ (పండు) (20) సూరారంలోని ఆనంద్ నగర్ కాలనీలో నివాసం ఉంటున్నారు. డిసెంబర్ నెల 20వ తేదీన ఇంట్లో ఎవరికి చెప్పకుండా వెళ్లిపోయింది. ఇప్పటివరకు ఇంటికి రాలేదు. చుట్టుపక్కల వెతికిన ఎక్కడ ఆచూకి లభించలేదు. ఆమె ఎత్తు 4.8 ఫీట్స్, నలుగు రంగు, తెలుగు, హిందీ భాషలు మాట్లాడుతుంది. ఆచూకీ తెలిసిన వారు సూరారం పోలీస్టేషన్లో తెలపాలని కోరారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

బిసిలు రాజకీయశక్తిగా ఎదిగినప్పుడే అన్నివర్గాలకు న్యాయం

-రౌండ్‌టేబుల్ సమావేశంలో వక్తలు

పోస్టర్ ఆవిష్కరిస్తున్న చెన్నరాములు, జైహింద్‌గౌడ్, శ్రీశైలం ముదిరాజ్, బోయవల్లి లింగస్వామి తదితరులు

హైదరాబాద్, జనవరి 9,ప్రభాతవార్త:

తెలంగాణలో బీసీల రాజకీయ సమర్థతను పెంపొందించేందుకు బిసిలు రాజకీయశక్తిగా ఎదిగినప్పుడే అన్నివర్గాలకు న్యాయం జరుగుతుందని వివిధ బిసి సంఘాల నేతలు అభిప్రాయపడ్డారు. ఈమేరకు గురువారం సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో బీసీ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు నాగనమోని చెన్నరాములు అధ్యక్షతన నిర్వహించిన రౌండ్‌టేబుల్ సమావేశానికి నవ సంఘర్షణ సమితి జాతీయ అధ్యక్షులు పంజాల జైహింద్ గౌడ్ తదితరులు హాజరై ప్రసంగించారు. ఈసందర్భంగా బీసీలకు జరిగిన చారిత్రక అన్యాయాలను అరికట్టడం, సామాజిక అభివృద్ధి సాధనకు బీసీ రాజకీయ శక్తిని సాధించాల్సిన అవసరాన్ని చర్చించారు. "గత 75 ఏళ్ల స్వతంత్ర భారతదేశంలో బీసీలు అన్ని విధాలుగా వివక్షకు గురయ్యారన్నారు. తెలంగాణలో 60 జనాభా ఉన్నప్పటికీ, బడ్జెట్ కేటాయింపులు, ఆర్థిక మద్దతు, విద్య, ఉపాధి రంగాల్లో బీసీలు పూర్తిగా వెనుకబడి ఉన్నారని పేర్కొన్నారు. ఈసందర్భంగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో పోలీస్, జాబ్ లో ఉండి, జై తెలంగాణ నినాదం చేసినందుకు కానిస్టేబుల్ ఉద్యోగాన్ని కోల్పోయిన శ్రీశైలం ముదిరాజును మెదక్, ఆదిలాబాద్, నిజామాబాద్, కరీంనగర్ పట్టబద్రుల నియోజకవర్గానికి ఎమ్మెల్సీ అభ్యర్థిగా బలపరుస్తున్నట్లు ప్రకటించారు. తదనంతరం శ్రీశైలం ముదిరాజ్ మాట్లాడుతూ తెలంగాణ కోసం బీసీలు చేసిన త్యాగాలకు అనుగుణంగా ఫలితాలు రాలేదని వాపోయారు. బీసీలు ప్రాణత్యాగాలు చేసినా, చివరికి అభివృద్ధి నిధులను అగ్రకుల పాలకులు స్వంత ఖజానాలో దాచుకున్నారు. ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలను నిర్వీర్యం చేసి, ప్రైవేట్ విద్యా సంస్థలకు ప్రోత్సాహం ఇస్తున్నారు," అని పేర్కొన్నారు. బీసీలకు ప్రధానంగా కావలసిన విద్య వైద్యాన్ని కార్పొరేట్ శక్తులు హస్తగతం చేసుకోవడంతో ఆదాయంలో సింహ భాగం విద్య వైద్యానికి ఖర్చు చేయవలసిన పరిస్థితి బీసీ ఎస్సీ ఎస్టీ మైనార్టీలు ఎదుర్కొంటున్నారని, తనను గెలిపిస్తే, ఉచిత విద్య ఉచిత వైద్యం ఉచిత న్యాయం అందరికీ అందుబాటులోకి వచ్చే విధంగా పోరాడుతానని హామీ ఇచ్చారు. ససమావేశంలో నాయకులు బోయవల్లి లింగస్వామి, పంజాల శ్రావణ్‌గౌడ్, ఉడుత మల్లేశ్, మమత గౌడ్, బుర్ర ధర్మయ్య గౌడ్, కొండ లలిత బాయి, సీత మహాలక్ష్మీ, పండుగ రేణుక, కర్ణాటక బీసీ కులాల రాష్ట్ర గౌరవ అధ్యక్షులు కాజన్న గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

కంటోన్మెంట్ బోర్డు నామినేటెడ్ మెంబర్‌గా రామక్రిష్ణ

కంటోన్మెంట్,జనవరి 9 ప్రభాతవార్త: సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డు నామినేటెడ్ మెంబర్‌గా కొనసాగుతున్న జె.రామక్రిష్ణ పదవి కాలం మరో సంవత్సరం పాటు పొడగించినట్లు కేంద్ర రక్షణ శాఖ ఈ నెల 3న గెజిట్ జారీ చేసింది. కంటోన్మెంట్ 5వ వార్డు మహేంద్రహిల్స్‌లో నివాసం ఉంటున్న నామినెటెడ్ మెంబర్ రామక్రిష్ణ పదవి కాలం వచ్చే నెల 10కి ముగుస్తుంది. బోర్డు ఎన్నికలు నిర్వహించకుండా 2025 ఫిబ్రవరి 11వ తేదీ వరకు ఆయన పదవి కాలన్నీ సంవత్సరం పాటు కొనసాగించినట్లు కేంద్ర రక్షణ శాఖ, జాయింట్ సెక్రటరీ రాఖేశ్ మిట్టల్ ఉత్తర్వులు జారీ చేశారు.

గోదారంగనాథ స్వామి కళ్యాణానికి ఏర్పాట్లు

యూసుఫ్‌గూడ, జనవరి 9, ప్రభాతవార్త:

శ్రీ వివేకానంద్‌నగర్‌లోని దుర్గమ్మ పోచమ్మ నాగదేవత ఆలయం తరుపున గురువారం శ్రీ గోదారంగనాథ స్వామివార్ల కళ్యాణానికి పెద్దఎత్తున భక్తులు పాల్గొని సారె సమర్పించారు. బ్యాండు మేళాలతో ఊరేగింపుగా ఆలయానికి తరలి వెళ్లి రంగనాథ స్వామి వార్ల కళ్యాణాన్ని కనుల పండువగా జరిపించేందుకు ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమంలో శ్రీ భూనీల సమేత వెంకటేశ్వరస్వామి ఆలయ కమిటీ చైర్మన్ పులగోళ్ల శ్రీనివాస్ యాదవ్, గణేషుల నాగేశ్వర్‌రావులతో పాటు మహిళలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

ఆరుగురిపై కేసు నమోదు చేసిన ఎక్సైజ్ పోలీసులు

సభ్యత్వ నమోదు కార్యక్రమానికి విశేష స్పందన

-టిడిపి పోలిట్‌బ్యూరో సభ్యులు అరవింద్ కుమార్‌గౌడ్



సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పాల్గొన్న అరవింద్‌కుమార్‌గౌడ్

ముషీరాబాద్, జనవరి 9, ప్రభాతవార్త: తెలుగుదేశం పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమానికి ప్రజల నుండి విశేష స్పందన ఉందని టీడీపీ పోలిట్‌బ్యూరో సభ్యులు అరవింద్‌కుమార్‌గౌడ్ తెలిపారు. గురువారం లోయర్‌ట్యాంక్‌బండ్‌లోని పార్టీ కార్యాలయంలో టీడీపీ సికింద్రాబాద్ పార్లమెంట్ అధ్యక్షులు పి.సాయిబాబా ఆధ్వర్యంలో నిర్వహించిన వికలాంగుల సభ్యత్వ నమోదు కార్యక్రమంకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా అరవింద్ కుమార్‌గౌడ్ మాట్లాడుతూ తెలంగాణలో తెలుగుదేశం పార్టీ ఉనికి లేదంటూ వ్యాఖ్యలు చేస్తున్న వారి నోళ్లు మూత పడేవిధంగా పార్టీ అభిమానులు, కార్యకర్తలు సభ్యత్వ నమోదు కార్యక్రమంకు స్వచ్ఛందంగా తరలి వచ్చి విజయవంతం చేస్తున్నారని కొనియాడారు. సభ్యత్వం నమోదు చేసుకున్న సభ్యులకు ప్రమాద భీమా రెండు లక్షల నుండి ఐదు లక్షలకు పెంచటం హర్షనీయమని అన్నారు. వికలాంగుల పట్ల తెలుగుదేశం పార్టీ ఎంతో ప్రాధాన్యత ఇస్తోందని, అందుకే సభ్యత్వ నమోదుకు వికలాంగులు పెద్దఎత్తున తరలి వస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

సంజీవరెడ్డినగర్ సమస్యలు పరిష్కరిస్తాం : ఎమ్మెల్యే తలసాని

క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే

కంటోన్మెంట్, జనవరి 9 ప్రభాతవార్తః సంజీవరెడ్డినగర్ లోని సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని మాజీమంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. గురువారం వెస్ట్ మారేడ్‌పల్లిలోని తన కార్యాలయంలో సంజీవరెడ్డి రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ ప్రతినిధులకు తలసాని శ్రీనివాస్ యాదవ్‌కు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం కాలనీ సమస్యలపై ఎమ్మెల్యేకు వినతిపత్రాన్ని అందజేశారు. సంక్రాంతి పండుగ అనంతరం అధికారులతో కలిసి కాలనీలో పర్యటించి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఎస్ఆర్‌నగర్‌లో గతంలో ఎవరు చేయని విధంగా తన హయాంలో అనేక అభివృద్ధి పనులు చేసిన విషయాన్ని గుర్తు చేశారు. ఎప్పటికప్పుడు తమ సమస్యలను పరిష్కరిస్తూ అండగా ఉంటున్న ఎమ్మెల్యేకు వారు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు నరేందర్ రెడ్డి, గౌతమ్, వివేక్‌నాథ్, అమర్నాథ్‌రెడ్డి, రోజారెడ్డి, స్టీవెన్, డేవిడ్‌రాజ్, అమీర్‌పేట డివిజన్ బీఆర్ఎస్ పార్టీ ప్రధాన కార్యదర్శి నామన సంతోష్ కుమార్ తదితరులు ఉన్నారు.

బాలవాణితో బాలల సమస్యలు పరిష్కారం

కవాడిగూడ కార్పొరేటర్ రచనశ్రీ

సమావేశంలో మాట్లాడుతున్న కవాడిగూడ కార్పొరేటర్ రచనశ్రీ

ముషీరాబాద్, జనవరి 9, ప్రభాతవార్త: బాలవాణితో బాలల సమస్యలు పరిష్కారం అవుతాయని కవాడిగూడ కార్పొరేటర్ రచనశ్రీ ఆశాభావం వ్యక్తం చేశారు. గురువారం దోమలగూడలోని భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ పాఠశాలలో అప్ప స్వచ్ఛంధ సంస్థ ఆధ్వర్యంలో ఇంద్రధనస్సు బాలల సంఘం బాలవాణి కార్యక్రమంకు ఆమె ముఖ్య అతిధిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ సమస్యలపై అధికారులతో చర్చించారు. వివిధ బస్తీలలో బాలల సంఘాలు ఏర్పరిచి, వాటి ద్వారా బస్తీ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువచ్చేందుకు అప్సా కృషి చేయటం అభినందనీయమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ లేబర్ అధికారి శిరీష, అప్ప సమాజిక కార్యకర్త బొట్టు రమేష్, బీజేపీ నాయకులు వెంకటేష్, వాటర్ వర్క్స్ ప్రతినిధి వినయ్‌కుమార్, ఆరోగ్యకేంద్రం సూపర్‌వైజర్ ప్రొఫెసర్ శ్రీరామ్, అంగన్వాడి టీచర్ పుష్పలీల, వివిధ బాలల సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

మారేడ్‌పల్లి డబుల్‌బెడ్‌రూమ్ ఇండ్ల తనిఖీ

మారేడ్‌పల్లి డబుల్‌బెడ్‌రూమ్ ఇండ్లను పరిశీలిస్తున్న ఆర్‌డిఓ సాయిరాం, తహశీల్దార్ బీమయ్య గౌడ్

కంటోన్మెంట్, జనవరి 9 ప్రభాతవార్త: వెస్ట్ మారేడ్‌పల్లిలో నిర్మించిన డబుల్‌బెడ్‌రూమ్ ఇండ్లను గురువారం సికింద్రాబాద్ ఆర్‌డిఓ సాయిరాం, మారేడ్‌పల్లి తహశీల్దార్ బీమయ్య గౌడ్‌లు పర్యవేక్షించారు. మారేడ్‌పల్లిలో నిర్మించిన మొత్తం డబుల్‌బెడ్‌రూమ్ ఇండ్లల్లో ఎంత మందికి అలాట్ చేశారు. ఇంకా ఎంత మందికి అలాట్ చేయాల్సి ఉంది. ఖాళీగా ఎన్ని ఉంటాయని అడిగి తెలుసుకున్నారు. స్థానికంగా నివాసం ఉంటున్న అర్హులైన లబ్ధిదారులకు వీలైనంత త్వరలో అలాట్ చేయాలని ఆయన తెలిపారు. అదే విధంగా స్థానికంగా నివాసం ఉంటున్న నాగపూరి పద్మ అనే బెన్‌ఫిషర్ ఇంటి స్థలంపై అనేక ఫిర్యాదులు రావడంతో ఆ ఇంటి స్థలంపై కొనసాగుతున్న నిర్మాణం పనులను ఆయన పర్యవేక్షించారు. అదే విధంగా లాలాపేట్ సాయి నగర్‌లో నిర్మించిన డబుల్‌బెడ్‌రూమ్ ఇండ్లను తనిఖీ చేశారు. మారేడ్‌పల్లి తహశీల్ కార్యాలయంలో పెండింగ్‌లో ఉన్న రికార్డులను, కోర్టు కేసులకు సంబంధించిన స్థలాలపై ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ సర్వేశ్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

జెబిఎస్‌లో గుర్తు తెలియని వ్యక్తి మృతి

కంటోన్మెంట్, జనవరి 9 ప్రభాతవార్త: సికింద్రాబాద్ జూబ్లీ బస్‌స్టేషన్‌లో ప్లాట్‌ఫారం నెం -13 వద్ద ఓ వ్యక్తి అపస్మారక స్థితిలో పడి ఉండగా విషయం తెలుసుకున్న మారేడ్‌పల్లి పోలీసులు చికిత్స నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ గురువారం తెల్లవారు జామున మృతి చెందారు. మృతుడు 45,50 సంవత్సరాల వయసులో ఉంటాడని, ముస్లిం మైనార్టికి చెందిన వారు అయి ఉండవచ్చునని పోలీసులు భావిస్తున్నారు. మృతుడి బంధువులు ఎవరైనా ఉంటే మారేడ్‌పల్లి పోలీసులను సంప్రదించాలని ఇన్‌స్పెక్టర్ నోముల వెంకటేష్ తెలిపారు. ఈ కేసును ఎస్ఐ సౌమ్య దర్యాప్తు చేస్తున్నారు.

నయనమనోహరం భారతీయ చతుష్టి కళలు : కేంద్ర మాజీమంత్రి వేణుగోపాలాచారి

రవీంద్రభారతి, జనవరి 9 ప్రభాతవార్త : గ్లోబల్ ఈవెంట్స్ ఆధ్వర్యంలో బుధవారం రవీంద్రభారతి ప్రధాన మందిరంలో సంక్రాంతి, గణతంత్ర దినోత్సవ వేడుకలను పురస్కరించుకొని సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు లయన్ కె.వి.రమణారావు నిర్వహణలో వందలాదిమంది కళాకారులచే అత్యంత అద్భుతంగా ప్రదర్శింపబడిన భారతీయ శాస్త్రీయ నృత్యాల సమ్మేళనం చతుష్టి కళలు నయన మనోహరంగా మంత్రముగ్ధులను చేశాయని ముఖ్యఅతిథిగా విచ్చేసిన కేంద్ర మాజీ మంత్రి డా. సముద్రాల వేణుగోపాలాచారి అన్నారు. ప్రతీ తల్లిదండ్రులు తమ పిల్లలకు వారికి ఆసక్తివున్న కళలను నేర్పించాలని, కళలవల్ల శారీరక, మానసిక చైతన్యం, ఉల్లాసం, మేధాశక్తి పెరుగుతుందని, వారి బంగారు భవిష్యత్తుకు బాటగా నిలుస్తుందని సూచించారు. పిల్లలకు కళల్లో చక్కని శిక్షణ ఇస్తున్న గురువులను, కళాకారులుగా తమ ప్రతిభను చాటుకోవడానికి రవీంద్రభారతి వంటి జాతీయ వేదికలను అందిస్తున్న ఏబిసి ఫౌండేషన్, గ్లోబల్ ఈవెంట్స్, భారత్ ఆర్ట్స్, జైజవాన్ జైకిసాన్, జైకళాకార్ సంస్థల అధినేత లయన్ కె.వి.రమణారావు 12ఏళ్ల సేవలను కొనియాడారు. అనంతరం వేణుగోపాలాచారి విశిష్ట అతిథులు దైవజ్ఞశర్మ, చకిలం సుధాకర్, డా. పద్మిని నాగులపల్లి, మానస్, సత్యంగౌడ్,

కళాకారిణి శ్రీదేవిని జ్ఞాపిక, ప్రశంసాపత్రంతో సత్కరిస్తున్న వేణుగోపాలాచారి, రమణారావు, దైవజ్ఞశర్మ తదితర అతిథులు

శ్రీదేవి, లయన్ కె.వి.రమణారావు తదితరులతో కలిసి ప్రఖ్యాత నాట్యగురువులు 12మందిని ఘనంగా సత్కరించి భారత వరల్డ్ రికార్డ్స్, కళాకార్ బుక్ ఆఫ్ రికార్డ్స్ ప్రశంసా పత్రాలు, సర్టిఫికెట్లు, కళాకారులను సత్కరించి జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలను ప్రదానంచేసి ఎంతగానో అభినందించారు. ఈ సందర్భంగా కళాకారులచే ప్రదర్శింపబడిన చతుష్టి కళల నృత్యవిన్యాసాలు అంబరాన్నంటాయి.

జలమండలికి కొత్తగా 141 మంది జూనియర్ అసిస్టెంట్లు

రెండు రోజుల పాటు శిక్షణ తరగతులను ప్రారంభించిన ఎండి అశోక్‌రెడ్డి

హైదరాబాద్, జనవరి 9 ప్రభాతవార్త

జలమండలికి కొత్తగా 141 మంది జూనియర్ అసిస్టెంట్స్ (పి అండ్ ఏ, ఎఫ్ అండ్ ఏ) నియామకం అయ్యారు. టిజిపిఎస్సీ నిర్వహించిన గ్రూప్4 పరీక్షల్లో ఉద్యోగం సాధించిన వీరిని ప్రభుత్వం జలమండలికి కేటాయించింది. రెండు రోజుల పాటు వీరికి శిక్షణ తరగతులు నిర్వహించనున్నారు. గచ్చిబౌలిలోని ఈస్కి క్యాంపస్‌లో జరుగుతున్న ఈ శిక్షణ తరగతుల్ని ఎండి అశోక్ రెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఎండి అశోక్ రెడ్డి మాట్లాడుతూ 1.3 కోట్ల జనాభా కలిగిన హైదరాబాద్ మహానగరానికి జలమండలి తాగునీటి సరఫరా, మురుగు నీటి నిర్వహణ సేవలు అందిస్తున్నది. ఇలాంటి మహత్తరమైన సంస్థలో ఉద్యోగం రావడం అదృష్టంగా భావించాలన్నారు. ఓఆర్ఆర్ వరకు విస్తరించిన జలమండలిలో చేరబోతున్న మీరంతా ప్రజలకు సేవలందించడమే పరమావధిగా పనిచేయాలని సూచించారు. ప్రభుత్వ ఉద్యోగం సాధించడానికి ఎలాగైతే కష్టపడ్డారో అలాగే నిజాయతీగా కష్టపడి జలమండలికి మంచి పేరు తీసుకురావాలని కోరారు. ప్రభుత్వం నిర్వహించిన ప్రజా పాలన విజయోత్సవాల సందర్భంగా గ్రూప్-4 లో ఉద్యోగం సాధించిన అభ్యర్థులకు సిఎం రేవంత్ రెడ్డి పెద్దపల్లిలో నియామక పత్రాలను ఇటీవలే అందజేశారు. ఈ కార్యక్రమంలో జలమండలి ఈఎన్సీ, రెవెన్యూ డైరెక్టర్ విఎల్ ప్రవీణ్ కుమార్, టెక్నికల్ డైరెక్టర్ సుదర్శన్, ఈస్కీ డైరెక్టర్ డాక్టర్ జి. రామేశ్వర్ రావు, సిజిఎంలు మహమ్మద్ అబ్దుల్ ఖాదర్, ప్రభు, పద్మజ పాల్గొన్నారు.

17 నుంచి 30 వరకు ఉచిత ప్లాస్టిక్ సర్జరీ క్యాంప్

హైదరాబాద్, జనవరి 9 ప్రభాతవార్త

సేవా భారతి, లయన్స్ క్లబ్ గ్రీన్ ల్యాండ్స్, మెర్సీ మిషన్స్ సంయుక్త ఆధ్వర్యంలో ఈనెల 17 నుండి 30 వరకు హైదరాబాద్ లోని మల్లేపల్లి సీతారాంబాగ్ ప్రాంతంలోని డాక్టర్ ఈశ్వర్ చంద్ర ఆసుపత్రిలో ఉచిత మెగా ప్లాస్టిక్ సర్జరీ క్యాంప్ నిర్వహిస్తున్నారు. ప్లాస్టిక్ సర్జరీ అత్యంత ఖరీదైన ఆపరేషన్‌గా మారిన ఈ రోజుల్లో నయాపైసా తీసుకోకుండా లక్షల రూపాయల విలువైన ఆపరేషన్లను ఉచితంగా చేయడంతో పాటు రోగులకు అవసరమైన మందులను సైతం ఉచితంగా అందించేందుకు నిర్వాహకులు ముందుకు రావడం చాలా గొప్ప విషయం. ఈ సందర్భంగా సేవాభారతి, లయన్స్ క్లబ్ గ్రీన్ ల్యాండ్, మెర్సీ మిషన్స్ ప్రతినిధులను, ఉచితంగా సర్జరీ చేసేందుకు ముందుకొచ్చిన వైద్యులకు నా ప్రత్యేక అభినందలు అని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ అన్నారు. డాక్టర్ ఆర్.సుదర్శన్‌రెడ్డి, డాక్టర్.భవానీ ప్రసాద్ ఆధ్వర్యంలో అమెరికాలోని డాక్టర్ల ప్రతినిధి బృందం ఇప్పటికే అభివృద్ధి చెందిన అనేక దేశాల్లో మెడికల్ క్యాంపులు నిర్వహిస్తూ పెద్ద సంఖ్యలో ఉచితంగా ప్లాస్టిక్ సర్జరీలు నిర్వహించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. అందులో భాగంగా హైదరాబాద్ ఓల్డ్ సీతారాంబాగ్ లోని సేవాభారతి ఎల్‌సీహెచ్ గ్రీన్ ల్యాండ్స్ వద్దనున్న డాక్టర్ ఈశ్వర్ చంద్ర ఆసుపత్రిలో నిర్వహించే ఉచిత మెగా ప్లాస్టిక్ సర్జరీ క్యాంప్ లో పాల్గొని సేవలు పొందాలని కోరుతున్నట్లు తెలిపారు. ఈ మెగా క్యాంప్ లో పాల్గొనాలనుకునే వారు 9848241640, 9908630301 మొబైల్ నంబర్లకు ఉదయం 9 నుండి సాయంత్రం 4 గంటల మధ్య ఫోన్ చేసి తమ పేర్లను నమోదు చేసుకోవాలి. తెల్లరేషన్ కార్డు ఉన్న వారికి ప్రాధాన్యత ఇవ్వబడుతుంది. ఈనెల 17, 18 తేదీల్లో ప్రాథమిక పరీక్షలు నిర్వహించిన అనంతరం అవసరమైన వారికి ఉచితంగా ప్లాస్టిక్ సర్జరీ చేయడంతోపాటు ఉచితంగా మందులను కూడా పంపిణీ చేయనున్నారు.

ఉద్యోగులు సమస్యల పరిష్కారానికి కృషి

టిఎన్‌జిఓఎస్ డైరీని ఆవిష్కరిస్తున్న ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎస్.ఎం.ముజీబ్‌హుస్సేనీ

బేగంబజార్, జనవరి 9ప్రభాతవార్త: తెలంగాణ నాన్ గజిటెడ్ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం తమ వంతుకృషి చేయడం జరుగుతుందని తెలంగాణ నాన్ గజిటెడ్ కేంద్ర సంఘం ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎస్.ఎం.ముజీబ్‌హుస్సేనీ అన్నారు. గురువారం తెలంగాణ నాన్ గజిటెడ్ హైదరాబాద్ జిల్లా కార్యాలయంలో జరిగిన సమావేశంలోకేంద్ర సంఘం అసోసియేట్ అధ్యక్షులు కె.వెంకటేశ్వర్లుతో కలిసి డైరీని అందచేశారు. ఈకార్యక్రమంలో తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర బిసి కమిషన్ చైర్మన్ నిరంజన్‌ను కలిసిన కాంగ్రెస్ నాయకులు

రాష్ట్ర బిసి కమిషన్ చైర్మన్ జి.నిరంజన్‌ను కలిసిన చాంద్రాయణ గుట్ట, బహదూర్‌పుర కాంగ్రెస్ నాయకులు

చార్మినార్, జనవరి 9 ప్రభాతవార్త : హైదరాబాద్ పాతబస్తీ చాంద్రాయణగుట్ట, బహదూర్‌పుర అసెంబ్లీ నియోజకవర్గాలకు చెందిన పలువురు కాంగ్రెస్ నాయకులు రాష్ట్ర బిసి కమిషన్ చైర్మన్ జి.నిరంజన్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. టిపిసిసి కార్యదర్శి జి.కన్నయ్యలాల్, బహదూర్‌పుర నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంఛార్జి పులిపాటి రాజేష్ కుమార్, కాంగ్రెస్ నాయకులు ఆర్.అశోక్ రెడ్డి, శ్యాంరావు ముదిరాజ్, జి. రాఘవేంద్ర, దినేష్ ముదిరాజ్‌లు రాష్ట్ర బిసి కమిషన్ చైర్మన్ జి.నిరంజన్‌ను కలిసిన వారిలో ఉన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి : ధనా గౌడ్

కంటోన్మెంట్, జనవరి 9 ప్రభాతవార్త: రోగాల నివారణకు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని జిహెచ్ఎంసి శానిటేషన్ సూపర్ వైజర్ ధనా గౌడ్ తెలిపారు. స్వచ్ఛ సర్వేక్షన్‌లో భాగంగా గురువారం వెస్ట్ మారేడ్‌పల్లి కస్తూర్బాగాంధీ జూనియర్, డిగ్రీ కళాశాలలో అవగాహన సదస్సు నిర్వహించారు. చెత్తను ఎక్కడపడితే అక్కడ వేయకుండా ఉండాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని స్లేకార్డులు చేతబూని ప్రదర్శన నిర్వహించారు. మీ ఇంటిలోని చెత్తను మూడు డస్ట్‌బిన్‌లలో తడి చెత్త, పొడి చెత్త, ప్రమాదకరమైన చెత్తలను వేర్వేరుగా వేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో శానిటరీ జవానులు షేక్ జహింగీర్, ప్రభాకర్, నర్సింగ్‌రావ్, ఎస్.ఎఫ్.ఏ. ఫర్వీన్, పులి రాజు, కోటయ్య తదితరులు పాల్గొన్నారు.

గురుకులాల్లో ప్రవేశాలకు 5వ తరగతికి దరఖాస్తుల ఆహ్వానం

కంటోన్మెంట్, జనవరి 9 ప్రభాతవార్త: సాంఘీక సంక్షేమ బాలికలు, బాలుర గురుకుల విద్యాలయాల్లో 2025-26 విద్యా సంవత్సరానికి ఇంగ్లీషు మీడియం 5వ తరగతి నుంచి ప్రవేశాలకు ఫిబ్రవరి 1వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని మహేంద్రహిల్స్ ప్రిన్సిపాల్ సునీత తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, బిసీ వర్గాలకు చెందిన ఆసక్తి గల విద్యార్థిని విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. కులం, ఆదాయం, పుట్టిన తేదీ, బోనోఫైడ్, ఆధార్ కార్డు, పాస్ ఫొటో వంటి అధారాలతో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. 5వ తరగతి అడ్మిషన్ల విషయంలో ఏమైనా సలహాలు, సూచనలకు 9704550236 నెంబర్‌ను సంప్రదించాలని ప్రిన్సిపాల్ సునీత తెలిపారు.

26న అమరజీవి కోసం శ్రీనివాస్‌గుప్త అమరణ దీక్ష

గోషామహల్, జనవరి8ప్రభాతవార్త:

తెలుగు విశ్వ విద్యాలయానికి అమరజీవి పోట్టిశ్రీరాములు పేరును తొలగించడం పట్ల ప్రజా ఏక్తా పార్టీ జాతీయ అధ్యక్షులు బోనాల శ్రీనివాస్‌గుప్త తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. ఈసందర్భంగా ఆయనతో సీనియర్ కాంగ్రెస్ నాయకులు జగ్ని నాగభూషణం, ప్రముఖ తెలుగు ప్రోడ్యూసర్ సుంకరమేష్‌లు తదితరులు ఈనెల 26వ తేదిన బోనాలశ్రీనివాస్ గుప్త చేపట్టబోయే అమరణ దీక్షాకు పూర్తిగా మద్దతు ప్రకటించినట్లు తెలిపారు. ఈ మేరకు వారు ఆయనతో చర్చించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం నిర్లక్ష్యంగా, తొందరపాటు చర్యగా అభివర్ణించారు. ఇటివలనే తెలుగు మహాసభలో పాల్గొన్ని మాట్లాడిన ముఖ్య మంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి ఎక్కడ ఉన్న తెలుగు వారు అందరు ఒక్కటే అన్నారు. అంత తొందరగాభాషా ప్రయుక్త రాష్ట్రాల కోసం ప్రాణ త్యాగం చేసిన అమరజీవి పోట్టి శ్రీరాములు పేరును ఉన్న తెలుగు యూనివర్సిటి పేరును తొలగించడం పట్ల తీవ్రంగా వ్యతిరేకించారు. ఆయన త్యాగం వల్లే తెలుగు ప్రజలకు ప్రత్యేక రాష్ట్రం వచ్చిందన్నారు. ఆమహానీయుడు పేరును ఎలా తొలగిస్తారన్నారు. తెలుగు ప్రజల మనోభావాలను దెబ్బతీశారన్నారు. అందుకు ఈనెల 26వ తేదిన జాతీయ జెండాను ఆవిష్కరించి పొట్టిశ్రీరాములు పేరును తెలుగు యూనివర్సిటికి పెట్టే వరకు తాను అమరణ నిరాహారదీక్ష చేపట్టనున్నట్లు తెలిపారు.

సమగ్ర వాఙ్మయ మూర్తి పింగళి లక్ష్మీ కాంతం

ప్రసంగిస్తున్న రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ పూర్వ చైర్మన్ డాక్టర్ ఆయాచితం శ్రీధర్

చిక్కడపల్లి, జనవరి 9 ప్రభాతవార్త: విమర్శ నాటకం పరిశోధన వ్యాసం అన్ని సాహితీ ప్రక్రియలలో అపార ప్రజ్ఞావంతుడు పింగళి లక్ష్మీ కాంతం సమగ్ర వాఙ్మయ మూర్తి అని రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ పూర్వ చైర్మన్ డాక్టర్ ఆయాచితం శ్రీధర్ అన్నారు. గురువారం సాయంత్రం చిక్కడపల్లి శ్రీ త్యాగరాయ గానసభ లోని కళా సుబ్బారావు కళా వేదిక పై గాన సభ నిర్వహణలో ఎందరో మహానుభావులు కార్యక్రమ పరంపరలో భాగంగా పింగళి లక్ష్మీ కాంతం యాది లో సంస్మరణ సమావేశం గానసభ అధ్యక్షుడు కళావిఎస్.జనార్దనమూర్తి అధ్యక్షతన జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన డాక్టర్ ఆయాచితం శ్రీధర్ పాల్గొని మాట్లాడుతూ కృష్ణా జిల్లా లోని గ్రామం లో జన్మించిన పింగళి లక్ష్మీ కాంతం రేపల్లె లో ప్రాథమిక విద్య పూర్తి చేసి మచిలీపట్నం, చెన్నపట్నంలలో ఉన్నత విద్య అభ్యసించి ఆంధ్ర విశ్వవిద్యాలయం లో ఆచార్యులుగా తెలుగు భాషాభివృద్ధికి విశేష కృషి చేశారని చెప్పారు. ఆయన రచించిన ఆంధ్ర సాహిత్య చరిత్ర పరిశోధకులుకు దారి దీపం వంటిదని అభివర్ణించారు. గాన సభ అధ్యక్షుడు కళా జనార్ధన మూర్తి, సినీ నిర్మాత రామ సత్యనారాయణ, కళా పోషకుడు పిఎస్ఆర్ మూర్తి, గాయని వరలక్ష్మి పాల్గొన్నారు.

టెక్నికాయిల్‌లో ఓవరాల్ ఛాంపియన్‌గా అంబేద్కర్ కళాశాల

క్రీడాకారులను సత్కరిస్తున్న కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శేఖర్, అడ్మిన్ అధికారి కిరణ్

చిక్కడపల్లి, జనవరి 9 ప్రభాతవార్త: ఉస్మానియా విశ్వవిద్యాలయం నిర్వహించిన అంతర్ కళాశాలల టెక్నికాయిల్ ఛాంపియన్‌షిప్ పోటీలలో బాగ్‌లింగంపల్లి డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కళాశాల ఓవరాల్ ఛాంపియన్‌గా నిలిచింది. మొదటి మ్యాచ్‌లో అంబేద్కర్ కళాశాల బద్రుకా కళాశాలపై, రెండవ మ్యాచ్‌లో కూడా బి కేడియా కళాశాలపై తమ విజయపరంపర కొనసాగించింది. అదే విధంగా ఫైనల్ మ్యాచ్ ఖైరతాబాద్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలపై అంబేద్కర్ కళాశాల (21సెట్లు 19-21, 21-06, 21-15) విజయం సాధించి ఓవరాల్ ఛాంపియన్‌గా నిలిచింది. ఉత్తమ ప్రదర్శనలు తరుణ్ శ్రీనివాస్ ఈ విజయం పట్ల అంబేద్కర్ కళాశాల యాజమాన్యం, అధ్యాపకులు, తోటి విద్యార్థులు క్రీడాకారులకు అభినందనలు తెలిపారు. వీరికి కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం శేఖర్, అడ్మిన్ అధికారి కిరణ్, ఫిజికల్ డైరెక్టర్స్ టి శ్రావణ్, పాండు తదితరులు పాల్గొని క్రీడాకారులకు మెడల్స్ సర్టిఫికెట్ ప్రధానం చేశారు.

జెఎన్టీయూహెచ్ ప్రొటెక్షన్ ఫోర్స్ విద్యార్థుల ఆందోళన..

కెపిహెచ్‌బి కాలనీ, జనవరి 9, ప్రభాతవార్త

జేఎన్టీయూహెచ్ విశ్వవిద్యాలయం పాలనా భవన్ ముందు గురువారం స్టూడెంట్స్ ప్రొటెక్షన్ ఫోరం, జేఎన్టీయూహెచ్ ప్రొటెక్షన్ ఫోర్స్ సంయుక్త ఆధ్వర్యంలో ఆర్ఎస్ క్యూ1 బాలుర వసతి దరఖాస్తు చేసుకున్న ప్రతి విద్యార్థికి వసతి గృహ సదుపాయాన్ని కల్పించాలని ధర్నాకు దిగారు. ఈ సందర్భంగా విద్యార్థి నాయకులు రాహుల్, శివకృష్ణలు మాట్లాడుతూ సాంకేతిక విశ్వవిద్యాలయం సమస్యల నిలయంగా మారిందని ఆరోపించారు వసతి గృహాలలో నివసించే పరిస్థితి లేదని, లీకేజీలవుతు దుర్వాసన వెదజల్లుతుందన్నారు. దోమల బెడదతో రాత్రిపూట కంటిమీద కొనుక్కు లేకుండా చేస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. వసతి గృహాలలో అడ్మిషన్ రాకపోవడంతో బయట ప్రైవేటు హాస్టల్‌లో ఉంటూ వేలకు వేలు రూపాయలు ఖర్చు చేయడం ఆర్థికంగా ఇబ్బందులతో చదువుకు దూరమయ్యే పరిస్థితి నెలకొందన్నారు. రీసెర్చ్ స్కాలర్స్ క్వార్టర్స్ లో అర్హత కలిగిన వారు ఒకరిద్దరు మాత్రమే ఉన్నారని వారిని బిపై క్వార్టర్స్ తరలించి ఆర్ఎస్ క్యు వన్ బాలుర వసతి

ఆందోళన నిర్వహిస్తున్న విద్యార్థులు

గృహంగా కన్వర్ట్ చేయాలని దీంతో దాదాపు 20 నుంచి 300 మంది విద్యార్థులకు వసతి గృహ సదుపాయం కల్పించవచ్చు అన్నారు. అధ్యానంగా మారుస్తున్న హౌస్ కీపింగ్ ఏజెన్సీని తక్షణమే మార్చివేయాలని అనధికారి వ్యక్తులకు కొమ్ముకాస్తున్న శ్రీ కార్తికేయ సెక్రటరీ ఏజెన్సీ ఔట్సోర్సింగ్ ఏజెన్సీలను వెంటనే మార్చాలని విద్యార్థులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి నాయకులు రోహిత్ కుమార్, అరవింద్ కుమార్, సిద్ధార్థ్, బ్రహ్మం గౌడ్, సాయికుమార్, రాథోడ్ తదితరులు ఉన్నారు.

శబరిమలైకి వెళ్లిన కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్

కంటోన్మెంట్, జనవరి 9 ప్రభాతవార్త: 41 రోజుల పాటు అయ్యప్ప స్వామి దీక్షలో ఉన్న కంటోన్మెంట్ ఎమ్మెల్యే ఎన్.శ్రీగణేష్ గురువారం బొల్లారం అయ్యప్ప దేవాలయంలో ఇరుముడి కట్టుకొని శబరిలోని అయ్యప్ప దేవాలయానికి వెళ్ళారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే కుటుంబ సభ్యులు, కంటోన్మెంట్ నియోజకవర్గానికి చెందిన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఆశీర్వాదం తీసుకున్నారు.

బొల్లారం అయ్యప్ప దేవాలయంలో ఇరుముడితో కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ తదితరులు

జియాగూడలో స్లాటర్ హౌస్‌ను అధునీకరించాలి

అభివాదం తెలుపుతున్న అసోయేషన్ నాయకులు

సైఫాబాద్, జనవరి 9 ప్రభాతవార్త: జియాగూడలోని స్లాటర్ హౌస్ నిర్మాణాన్ని తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం అధునీకరిచాలని ఆరె కటిక మొండేదార్ అసోసిమేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కె.శ్రీనివాస్ డిమాండ్ చేశారు

ప్రజల సంక్షేమానికి కృషి

-ఎమ్మెల్యే మేరాజ్ జాఫర్ హుస్సేన్

భరత్ నగర్‌లో పర్యటిస్తున్న ఎమ్మెల్యే మేరాజ్ జాఫర్ హుస్సేన్, చిత్రంలో శివ యాదవ్ తదితరులు

మలక్ పేట,జనవరి 9, ప్రభాతవార్త : ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉండి వారి సంక్షేమానికి కృషి చేస్తామని యాఖత్ పూర నియోజకవర్గం ఎమ్మెల్యే మేరాజ్ జాఫర్ హుస్సేన్ పేర్కొన్నారు. కురుమగుడా డివిజన్ లోని భరత్ నగర్ లో నూతనంగా నిర్మిస్తున్న రోడ్డు నిర్మాణం పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గం లో ఇప్పటివరకు పలు అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టడడం జరిగిందని, త్వరలో మరిన్ని అభివృద్ధి పనులను చేపట్టడానికి ప్రణాళికలను రూపొందించనున్నట్లు తెలిపారు. ప్రజల సమస్యలను తెలుసుకుని వాటిని పరిష్కరించడం కోసం ప్రతినిత్యం నియోజకవర్గంలోని పలు ప్రాంతాలలో వివిధ శాఖల అధికారులతో కలిసి పర్యటిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కురుమగుడా కార్పొరేటర్ షెఫర్డ్ అలీ, టిఎస్ డి రాష్ట్ర ఉపాధ్యక్షుడు శివ యాదవ్, నాయకులు అక్రమ్, ముబిన్ ఖాన్, వాజిద్, నజీర్ తదితరులు పాల్గొన్నారు.

మరణించిన రైతు కుటుంబానికి ఆర్థిక సహాయం



బాధిత రైతు కుటుంబానికి సహాయం అందజేస్తున్న సంఘం సభ్యులు

తుర్కయంజాల్ జనవరి 9,ప్రభాతవార్త : తుర్కయంజాల్ రైతుసేవా సహకార సంఘంలో అప్పు ఉన్న సభ్యుడు తుర్కయంజాల్ మున్సిపాలిటీ కోహెడ గ్రామానికి చెందిన రైతు కోట్ల బాబు గౌడ్ అనారోగ్యం సమస్యలతో చికిత్స పొందుతున్నప్పటికీ ఆరోగ్యం కుదరక దురదృష్టవశాత్తు మంగళవారం అకస్మాత్తుగా మరణించడంతో మృతుడి భార్య శ్రీమతి కోట్ల లావణ్య కి సహాయం సంఘం నుండి రూ.25 వేలు రూపాయల చెక్కును ఆర్థిక సహాయంగా టేస్కబ్ వైస్ చైర్మన్ డి సి సి బి చైర్మన్ కొత్తకుర్మ సత్తయ్య సంగం డైరెక్ట్ లతో కలిసి చెక్కును అందజేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతు సేవా సహకార సంఘాలు రైతులకు ఎల్లప్పుడూ అండగా ఉంటాయని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం వైస్ చైర్మన్ కొత్త రామ్ రెడ్డి, డైరెక్టర్లు వంగేటి లక్ష్మారెడ్డి, సామ సంజీవ రెడ్డి, కొంద్రు స్వప్న, చాపల యాదగిరి, జక్క కృష్ణారెడ్డి, సి.ఈ.ఓ వై. రాందాస్ , సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఉత్సవాలను శాంతియుతంగా జరుపుకోవాలి : ఇన్‌స్పెక్టర్ నరేష్

నూతన సంవత్సరం క్యాలెండర్ ను ఆవిష్కరిస్తున్న ఇన్ స్పెక్టర్ పిడమర్తి నరేష్, చిత్రంలో పాస్టర్ వన్య ఇమాన్యుయల్ తదితరులు

మలక్ పేట ,జనవరి 9, ప్రభాతవార్త : ఉత్సవాలను శాంతియుత వాతావరణంలో ప్రశాంతంగా జరుపుకోవాలని మలక్ పేట ఇన్ స్పెక్టర్ పిడమర్తి నరేష్ పేర్కొన్నారు. ముసారాంబాగ్ క్రిస్టియన్ లైఫ్ సెంటర్ చర్చి ఫౌండర్, సీనియర్ పాస్టర్ ప్రభు చరణ్, పాస్టర్ వన్య ఇమన్యుయల్ ల ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్ ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పండుగలు సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబిస్తాయని తెలిపారు. పాస్టర్లు ప్రభచరణ్ వన్య ఇమన్యుయల్ లు మాట్లాడుతూ ప్రజలు సత్యమార్గాన్ని అనుసరించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు చర్చి ప్రతినిధులు పాల్గొన్నారు.

కళ్యాణ లక్ష్మి , షాదిముభారక్ చెక్కుల పంపిణీ

సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ శాంతి సాయిజన్ శేఖర్

నాచారం, జనవరి 9 ప్రభాతవార్త : నాచారం డివిజన్‌కు చెందిన పలువురి సీఎంఆర్ఎఫ్, షాదిముభారక్ చెక్కులను లబ్దిదారులకు గురువారం కార్పోరేటర్ శాంతి సాయిజన్ శేఖర్ పంపిణీ చేశారు. కళ్యాణ లక్ష్మి షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమం ఉప్పల్ సర్కిల్ కార్యాలయంలో కార్పొరేటర్లు శాంతి సాయిజన్ శేకర్,బన్నాల గీత ప్రవీణ్‌లు ఎమ్మార్వో ఆధ్వర్యంలో పంపిణీ చేశారు.

కొత్తపేట బిజెపి అధ్యక్షుడిగా రాజేష్ ఏకగ్రీవం

మంచి రాజేష్, కాట విజయను సన్మానిస్తున్న పవన్‌కుమార్, జంగారెడ్డి

ఎల్.బి.నగర్, జనవరి 9 ప్రభాతవార్త: కొత్తపేట డివిజన్ బిజెపి అధ్యక్షునిగా మంచి రాజేష్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.ఈ సందర్భంగా కొత్తపేట డివిజన్ కార్పొరేటర్ నాయికోటి పవన్‌కుమార్ సమక్షంలో నూతనంగా కొత్తపేట డివిజన్ అధ్యక్షుడుగా ఎన్నికైన మంచి రాజేష్‌కుమార్, రంగారెడ్డి అర్బన్ జిల్లా ప్రతినిధిగా ఎన్నికైన కాట విజయ ఎన్నిక కావడం పట్ల వర్షం ప్రకటిస్తూ వారిని సాల్వాతో సత్కరించి జ్ఞాపికలను అందజేశారు. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా బిజెపి అధికార ప్రతినిధి జంగారెడ్డి, నాయకులు వజీర్ కుమార్‌గౌడ్,వెంకటేష్‌గౌడ్, రాజేష్, కుషిద్, సుందర్ నారాయణ,రాకేష్‌యాదవ్,నాయికోటి అనిల్‌కుమార్, నరసింహ తదితరులు హాజరై వారిని శాలువాతో సత్కరించి అభినందనలు తెలియజేశారు.

వానవి కాలనీలోని అష్టలక్ష్మీ దేవాలయంలో గోదా రంగనాథులకు గోదా మంగళ గోష్ఠి విభిధ దేవాలయాలనుంచి తీసుకువచ్చిన మాలలను సమర్పించారు. ఈ పూజా కార్యక్రమంలో దేవాలయం కమిటీ సబ్యులు, వందలాదిమంది భక్తులు పాల్గొన్నారు.

సంఘటితంగా ఉంటేనే సమస్యలకు పరిష్కారం : ఎమ్మెల్సీ కోదండరాం

తార్నాక, జనవరి 9 ప్రభాతవార్త : సంఘటితంగా ఉండటం ద్వారా కుల అభివృద్ధి సాధ్యమవుతుందని ఎమ్మెల్సీ ప్రొ. కోదండరాం అన్నారు. క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమాల ద్వారా ఆయా వర్గాల ఐక్యత ఏర్పడుతుందని చెప్పారు. ఉస్మానియా యూనివర్సిటీ గెస్ట్ హౌస్ లో గురువారం పెరిక కుల ఎంప్లాయిస్ అండ్ ప్రొఫెషనల్స్ సొసైటీ ఆఫ్ ఇండియా(పెప్సీ) క్యాలెండర్ ను కోదండరాం, రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ సంగని మల్లేశ్వర్ తో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కులగణన ద్వారా అన్ని వర్గాల నిష్పత్తి స్పష్టతకు వస్తుందని ఆశభావం వ్యక్తం చేసారు. పెరిక కులస్తుల అభివృద్ధికి తన వంతు సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు.తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుక్నులగణన వ్యవహారం ఆషామాషీ కాదని పెప్సీ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ సంగాని మల్లేశ్వర్ అన్నారు. ఎన్నికల ముందు హామీ ఇచ్చినట్టుగానే సీఎం రేవంత్ రెడ్డి అమలుకు పూనుకున్నారని అన్నారు. మేమెంత ఉన్నామన్నది మాకు ఇప్పటికీ తెలువక, తమకు దామాషా ప్రకారం రావాల్సిన పదవులు, హక్కులు ఇప్పటికీ

నూతన సంవత్సర కేలండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ ప్రొ.కొదండరాం, డా.మల్లేశ్వర్ తధితరులు

లభించలేదన్నారు. ఈ కార్యక్రమంలో పెరిక కుల వసతి గృహం వ్యవస్థపాక సభ్యులు, ఏడ్మా నర్సింగ రావు, పెప్సీ నాయకులు గుమ్మళ్ళ మల్లికార్జున్, రాష్ట్ర కోశాధికారి అప్పని సతీష్ కుమార్, ఉమ్మడి జిల్లాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు అకా రాధాకృష్ణ, బేడుద వెంకటయ్య, శ్రీరామ్ వీరయ్య, మేడిశెట్టి శ్రీనివాస్ రావు, బోళ్ల వీర ప్రతాప్, రాందేని చంద్రమోళి, శ్రీరామ్ సత్యనారాయణ, బండి శ్రీకాంత్, అచ్చ పరమేశ్వర్, బగ్గని జనార్ధన్, ముద్దసాని శ్రీనివాస్ తదితరులు, పెప్సీ,పెరిక సంఘం నాయకులు పాల్గొన్నారు.

లబ్దిదారులకు కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ : తహసీల్దార్

ఉప్పల్, జనవరి 9 ప్రభాతవార్త : కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకం ద్వారా పేదలకు తగు చేయూత అందిస్తున్నామని ఉప్పల్ తహసీల్దార్ వాణిరెడ్డి, కార్పొరేటర్లు బండారు శ్రీవాణి, బన్నాల గీత, శాంతి పేర్కొన్నారు. ఈ మేరకు గురువారం ఉప్పల్ సర్కిల్ కార్యాలయంలో కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకం కింద మంజూరైన చెక్‌లను లబ్దిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ కల్యాణలక్ష్మి పథకం దరఖాస్తు చేసుకున్న పేదలకు ప్రభుత్వం తక్షణమే చెక్‌లు జారీ చేస్తుందని తెలిపారు. ఉప్పల్ మండల పరిధిలోని నాచారంలో 18 మందికి, మల్లాపూర్‌లో 26 మందికి, మీర్‌పేటలో 10 మందికి, ఉప్పల్‌లో 40 మందికి, చిలుకానగర్‌లో 16 మందికి, హబ్సిగూడలో 5 మందికి, రామంతాపూర్‌లో 45 మందికి చెక్‌లు జారీ చేసినట్లు తహసీల్దార్ వాణిరెడ్డి తెలిపారు. మొత్తం 160 మందికి చెక్‌లు పంపిణీ

లబ్దిదారులకు కల్యాణలక్ష్మి చెక్‌లు అందజేస్తున్న కార్పొరేటర్ బండారు శ్రీవాణి, తహసీల్దార్ వాణిరెడ్డి తదితరులు

చేసినట్లు ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈ కార్యక్రమంలో డిప్యూటి తహసీల్దార్ సునీల్‌కుమార్, ఆర్.ఎం. అశ్విని,జూనియర్ అసిస్టెంట్ అనంతరాములు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించాలి : పవన్

ఎల్.బి.నగర్, జనవరి 9 ప్రభాతవార్త: అభివృద్ధి పనుల విషయంలో అధికారులు, కాంట్రాక్టర్లు నాణ్యత ప్రమాణాలు పాటించాలని కొత్తపేట డివిజన్ కార్పొరేటర్ నాయకోటి పవన్‌కుమార్ సూచించారు. కొత్తపేట డివిజన్ మోహన్‌నగర్ కాలనీలో నూతనంగా నిర్మించిన డ్రైనేజ్‌లైన్ పనులు, సీసీ రోడ్డు ప్యాచ్‌వర్క్ పనులు పూర్తి కావడంతో కాలనీవాసులతో కలిసి కార్పొరేటర్ గురువారం కాలనీలో పర్యటించి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్యాచ్‌వర్క్ పనుల్లో నాణ్యత పాటించాలని, గతంలో ప్యాచ్‌వర్క్ సరిగ్గా చేయకపోవడం వల్ల వర్షానికి మొత్తం కొట్టుకుపోయి గుంతలుగా మారాయని, దీంతో కాలనీ ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారని, వాటికి కూడా

పనులను పరిశీలిస్తున్న పవన్‌కుమార్

మరమ్మత్తులు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కాలనీ ఉపాధ్యక్షుడు రాజశేఖర్, మురళీ కృష్ణ, నాయకులు సుందర్ నారాయణ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్రతి రోజూ పౌష్టికాహారం ఇవ్వాలి : నారాయణ ప్రిన్సిపాల్ బాబ్జి

సరూర్‌నగర్, జనవరి 9 ప్రభాతవార్త: విద్యార్థులకు ప్రతి రోజూ పౌష్టికాహారం ఇవ్వాలని వారి తల్లిదండ్రులకు మీర్‌పేట్ నారాయణ ఐఐటి ఒలంపియాడ్ పాఠశాల ప్రిన్సిపాల్ బాబ్జి సూచించారు. గురువారం పాఠశాలలోని ఈ-ఛాంప్స్ విద్యార్థులచే మాస్టర్ చెఫ్-ఫైర్ ఫ్రీ ఫుడ్ ఫెస్టివల్‌ను నిర్వహించారు. ఈ ఫెస్టివల్‌లో ఉత్సాహంగా పాల్గొన్న విద్యార్థులు తమ ఇళ్ళల్లో తల్లులతో తయారు చేయించి తీసుకువచ్చిన వివిధ ఆహార పదార్థాలను ప్రదర్శించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ బాబ్జి మాట్లాడుతూ పౌష్టికాహారం తీసుకోవడం వల్ల విద్యార్థుల మేధస్సు పెరుగుతుందనీ నిత్యం చురుకుగా ఉంటారని అన్నారు. ఇంట్లోనే పిల్లలకు రుచికరమైన ఆహార పదార్థాలను, స్నాక్స్‌ను తయారు చేసి ఇవ్వడం వల్ల బయట లభించే ఫాస్ట్‌ఫుడ్, జంక్ ఫుడ్ వైపు పిల్లలు ఆకర్షితులు కారని ఆయన అభిప్రాయపడ్డారు. ఇంటి భోజనానికి, ఆహార పదార్థాలకు ప్రాధాన్యతినిచ్చే విధంగా తమ పాఠశాలలో ఇలాంటి కార్యక్రమాలను నిర్వహిస్తు

విద్యార్థులను అభినందిస్తున్న మీర్‌పేట్ నారాయణ ప్రిన్సిపాల్ బాబ్జి

న్నామని ఆయన వెల్లడించారు. అనంతరం విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులను ఇచ్చి వారిని, వారి తల్లిదండ్రులను అభినందించారు. ఈ కార్యక్రమంలో నారాయణ జిఎం గోపాల్‌రెడ్డి, ఎజిఎం రవీంద్రబాబు, కో-ఆర్డినేటర్లు సృజన, వాణి, ప్రియాంక, ఎఒ, ఎడి, ఈ-కిడ్స్, ఈ-ఛాంప్స్ విపిలు ధరణి, ధనలక్ష్మి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నాదర్‌గుల్‌లో అక్రమ కట్టడాలపై బడంగ్‌పేట్ కమిషనర్ కొరడా

నాదర్‌గుల్‌లో అక్రమ కట్టడాలను కూల్చివేస్తున్న దృశ్య

సరూర్‌నగర్, జనవరి 9 ప్రభాతవార్త: బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని నాదర్‌గుల్‌లో అక్రమ నిర్మాణాలపై కమీషనర్ ఉక్కు పాదం మోపారు. నాదర్‌గుల్ బస్టాండ్ సర్కిల్‌లో గ్రామ సర్వే నెంబర్ 180/ఎ లోని 1100 గజాల స్థలంలో అక్రమంగా నిర్మించిన షెడ్లను కూల్చివేయించారు. గురువారం కమీషనర్ పి.సరస్వతి ఆదేశాల మేరకు టిపిఎస్ లాలప్ప సిబ్బందితో తరలివెళ్ళి అక్రమ నిర్మాణాలైన రేకుల షెడ్లను కూల్చివేయించారు. అక్రమ నిర్మాణాల కూల్చివేతల నేపథ్యంలో కమీషనర్ ఒక ప్రకటన విడుదల చేశారు. కార్పొరేషన్ పరిధిలో ఎవరైనా అనుమతి లేకుండా ఎలాంటి నిర్మాణాలు జరిపినా అదే విధంగా నిబంధనలకు, ప్లానుకు విరుద్ధంగా నిర్మాణాలు చేపట్టినా కఠిన చర్యలు తీసుకుంటామని ఆమె స్పష్టం చేశారు. మున్సిపల్ యాక్టు 2019 ప్రకారం అక్రమ నిర్మాణాలను ఉపేక్షించమనీ కూల్చివేస్తామని కమీషనర్ హెచ్చరించారు. కార్పొరేషన్‌లో నిర్మాణాలు జరుపుకోవాలనుకునే వారు తప్పనిసరిగా కార్పొరేషన్ నుండి అనుమతులు తీసుకొని ప్లాను ప్రకారమే నిర్మాణాలు చేపట్టాలని సరస్వతి సూచించారు.

గంజాయి విక్రయిస్తున్న నిందితుడి అరెస్ట్

గంజాయి విక్రయిస్తున్న నిందితుడిని అరెస్ట్ చేసిన ఉప్పల్ ఎక్సైజ్ పోలీసులు దృశ్యం.

ఉప్పల్, జనవరి 9 ప్రభాతవార్త : ఇతర రాష్ట్రాల నుంచి గంజాయి తెచ్చి విక్రయిస్తున్న ఒక వ్యక్తిని ఉప్పల్ ఎక్సైజ్ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఎక్సైజ్ సిఐ బి.ఓంకార్ తెలిపిన వివరాల ప్రకారం.. బీహార్‌కు చెందిన మదన్‌రామ్ అనే వ్యక్తి మల్లాపూర్‌లో గంజాయి విక్రయిస్తుండగా పోలీసులు వలపన్ని పట్టుకున్నట్లు తెలిపారు. నిందితుడి వద్ద నుంచి 2520 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. అతను బీహార్ రాష్ట్రం నుంచి ఎండు గంజాయి తెచ్చి నగరంలో విక్రయాలు చేస్తున్నాడని తెలిపారు. ఈ మేరకు ఉప్పల్ ఎక్సైజ్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ముగ్గుల పోటీలు

అత్తాపూర్ జనవరి9,ప్రభాతవార్త : రాజేంద్రనగర్ సర్కిల్‌లో నవ యువ యూత్ ఆధ్వర్యంలో సంక్రాంతి పండుగను పురస్కరించుకుని గురువారం మైలర్ దేవ్‌పల్లి డివిజన్ బుద్వేల్ నేతాజీ నగర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థినులకు ముగ్గుల పోటీ నిర్వహించారు. ఈ పోటీలో విద్యార్థులు ఉత్తమమైన ముగ్గులను వేసి తమ సృజనాత్మకతను ప్రదర్శించారు. పోటీలో గెలుపు పొందిన విద్యార్థులు ప్రథమ బహుమతి 5వ తరగతి మనిష, ద్వితీయ బహుమతి 4వ తరగతి షిపు హర్షి ,తతృతీయ బహుమతి 3వ తరగతి ,శ్రీ జ్యోతి ప్రోత్సాహక బహుమతుల శుక్రవారం అందించనున్నారు.ఈ కార్యక్రమంలో అనుకుమారి, భారతి, కుమారి, వరలక్ష్మీ, తనియా క్లబ్ అధ్యక్షులు ఏర్వ కుమారస్వామి,కిషోర్ రెడ్డి, శ్రీనివాస్, నవీన్ రెడ్డి, పాఠశాల ప్రధాన ఉపాధ్యాయులు ఎస్. బాలకృష్ణ, జి. మమత, ఏ. మహేశ్వర్, ఎస్. లక్ష్మి, పి. యాదమ్మ పాల్గొన్నారు.

పికిల్ బాల్ కోర్టును ప్రారంభించిన హైడ్రా కమిషనర్

అత్తాపూర్ జనవరి9,ప్రభాతవార్త : ఉప్పరపల్లిలో నూతనంగా ఏర్పాటు చేసిన పికిల్ బాల్ కోర్టును హైడ్రా కమిషనర్ సందర్శించి ప్రారంభించారు. నగరంలో ఇప్పుడిప్పుడే ప్రాచుర్యం పొందుతున్న ఈ క్రీడ గురించి నిర్వాహకులు ఆయనకు వివరించారు.ఈ కార్యక్రమంలో మాజీ ఐపిఎస్ అధికారి బాబు రావు, బోక్క బాల్ రెడ్డి,విశ్వేశ్వర రావు,ప్రకాష్, శ్రీనాత్, సరికొండ రాజు,కిషోర్,ప్రసాద్,మేనేజ్మెంట్ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

ధర్మకర్త లక్ష్మిరామాచారికి సత్కారం

లక్ష్మీరామాచారిని సన్మానిస్తున్న గణేష్‌నేత, ఉపేందర్‌రెడ్డి

ఎల్.బి.నగర్, జనవరి 9 ప్రభాతవార్త: ఆర్కేపురం డివిజన్‌లో శ్రీఖిల్లా మైసమ్మ దేవస్థానం ధర్మకర్తగా చిలుకూరి లక్ష్మీరామాచారి గురువారం బాధ్యతలు చేపట్టారు. ఈ సంధర్భంగా ఆర్కేపురం డివిజన్ కాంగ్రెస్ పార్టీ కంటెస్టెడ్ కార్పొరేటర్ పున్న నిర్మలాగణేష్‌నేత, ఖిల్లా మైసమ్మ దేవాలయం ఛైర్మన్ సురేందర్‌కుమార్, డివిజన్ అధ్యక్షుడు పున్న గణేష్‌నేత, యువజన నాయకులు చిలక ఉపేందర్‌రెడ్డిలు ఆమెను శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ధర్మకర్తలు రాజునాయిక్, సందీప్ దేవాలయ అధికారులు, ఆలయ అర్చకులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నాగోల్ బిజెపి అధ్యక్షుడిగా పంగా శ్రీకాంత్

శ్రీకాంత్‌కు నియామక పత్రం అందజేస్తున్న సామ రంగారెడ్డి, చింతల సురేందర్‌యాదవ్

ఎల్.బి.నగర్, జనవరి 9 ప్రభాతవార్త: నాగోల్ డివిజన్ బిజెపి అధ్యక్షునిగా నాగోల్ గ్రామానికి చెందిన పంగా శ్రీకాంత్ నియామకమయ్యారు. ఈ మేరకు రంగారెడ్డి జిల్లా బిజెపి అధ్యక్షుడు సామ రంగారెడ్డి, బిజెపి ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు చింతల సురేందర్‌యాదవ్ గురువారం శ్రీకాంత్‌కు నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ మాట్లాడుతూ డివిజన్లో బిజెపి బలోపేతానికి కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు వసుపరి మల్లేష్ కురుమ, ఐలయ్య, దప్పు రాజు పాల్గొన్నారు.

రోడ్డు భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత : ఆర్‌టిఒ రవీందర్‌రెడ్డి

రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా ర్యాలీ నిర్వహిస్తున్న రవాణాశాఖ అధికారి రవీందర్‌రెడ్డి తదితరులు

ఉప్పల్, జనవరి 9 ప్రభాతవార్త : మేడ్చల్ జిల్లా రవాణాశాఖ ఆధ్వర్యంలో రోడ్డు మాసోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా ఉప్పల్ రవాణాశాఖ కార్యాలయం సిబ్బంది ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఉప్పల్ మోటర్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్ రవీందర్‌రెడ్డి, ఉమ తదితరులు పాల్గొన్నారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో ఎంవిఐ రవీందర్‌రెడ్డి, ఉమా మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరు రోడ్డు భద్రతా నియమాలు పాటించాలని సూచించారు. జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాల సందర్భంగా రోడ్డు ప్రమాదాలపై అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. ప్రమాదాలు జరుగకుండా తగు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ఈకార్యక్రమంలో రవాణా కార్యాలయం సిబ్బంది పాల్,అరుణ్, అభిలాష్, స్టీపెన్, అమృత్ తదితరులు పాల్గొన్నారు.

పోలీసు సేవలపై అభిప్రాయాలు చెప్పండి : ఎసిపి చక్రపాణి

పోలీసు సేవలపై ప్రజాభిప్రాయం పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎసిపి ఎస్.చక్రపాణి, సిఐ ఎలక్షన్‌రెడ్డి, డిఐ రామలింగారెడ్డి తదితరులు

ఉప్పల్, జనవరి 9 ప్రభాతవార్త : తెలంగాణ పోలీసుల సేవలపై ప్రజలు తమ అభిప్రాయాలు తెలియజేయాలని మల్కాజిగిరి ఎసిపి ఎస్.చక్రపాణి కోరారు. ఈ మేరకు రాచకొండ పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు మల్కాజిగిరి ఎసిపి కార్యాలయంలో రూపొందించిన పోస్టర్‌ను ఎస్.చక్రపాణి, సిఐ ఎలక్షన్‌రెడ్డి, డిఐ రామలింగారెడ్డిలు ఆవిష్కరించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో ఎసిపి మాట్లాడుతూ ప్రజలు తమ ఫిర్యాదులను నేరుగా కలిసి ఇవ్వవచ్చని, ఫిర్యాదులు, ఎఫ్ఐఆర్ కాపీలు, ట్రాఫిక్ చలాన్లు, పాస్‌పోర్టు వెరిఫికేషన్, ఇతర వివరాలను స్కాన్ చేసి తెలుసుకోవచ్చని తెలిపారు. ఈ పోస్టర్‌ను అన్ని పోలీస్‌స్టేషన్ వద్ద అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో పలువురు పోలీస్ అధికారులు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

గాంధీనగర్‌లో సిసి రోడ్డు పనులు : ఎండి.రఫీక్

గాంధీనగర్‌లో సిసి రోడ్డు పనులు పరిశీలిస్తున్న కాంగ్రెస్ డివిజన్ అధ్యక్షుడు ఎండి.రఫీక్ తదితరులు

రామంతాపూర్, జనవరి 9 ప్రభాతవార్త : రామంతాపూర్ డివిజన్ గాంధీనగర్‌లో నూతనంగా చేపట్టిన సిసి రోడ్డు పనులను గురువారం కాంగ్రెస్ పార్టీ డివిజన్ అధ్యక్షుడు ఎం.డి.రఫీక్ పరిశీలించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ రామంతాపూర్‌లోని అన్ని ప్రాంతాల్లో సిఎం రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు పలు అభివృద్ధి పనులు చేపట్టినట్లు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ మందముల పరమేశ్వర్‌రెడ్డి దృష్టికి సమస్యలు తీసుకుని వచ్చి వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ప్రజలకు మౌళిక సదుపాయాలు కల్పించడమే ధ్యేయంగా ముందుకు సాగుతున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో గాంధీనగర్ కాలనీ అధ్యక్షుడు మొగలి లింగం, రమేష్, కార్యదర్శి శ్రీనివాస్‌గౌడ్, యూసుప్, ఫయాజ్ పాల్గొన్నారు.

మాదిగ రాజకీయ పోరాట సమితి నగర ప్రధాన కార్యదర్శిగా వెంకటేష్

వెంకటేష్ కు నియామకపు ఉత్తర్వులు అందజేస్తున్న చిట్టు పాక ప్రభాకర్ మాదిగ

మలక్ పేట ,జనవరి 9, ప్రభాతవార్త : మాదిగ రాజకీయ పోరాట సమితి హైదరాబాద్ ఊ ప్రధాన కార్యదర్శిగా కొండగడుపుల వెంకటేష్ మాదిగ నియమితులయ్యారు. ఈ మేరకు మాదిగ రాజకీయ పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షులు చిట్టుపాక ప్రభాకర్ మాదిగ నియామకపు ఉత్తర్వులను జారీ చేశారు. ఈ సందర్భంగా ప్రభాకర్ మాదిగ మాట్లాడుతూ మాదిగల జనాభా 2024 ప్రకారం రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఎస్సీ వర్గీకరణ చేపట్టాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఉమ్మడి ఎస్సీ రిజర్వేషన్లను 15 నుంచి 18 శాతానికి పెంచాలని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నియమించిన ఏక సభ్య కమిషన్ ఇచ్చిన రిపోర్టును, సుప్రీంకోర్టు ఇచ్చిన ఎస్సీ వర్గీకరణ తీర్పును పరిగణలోకి తీసుకోవాలని కోరారు. అసెంబ్లీ సాక్షిగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని విజ్ఞప్తి చేస్తూ ఎస్సీ వర్గీకరణను వెంటనే అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమం నాయకులు సతీష్ మాదిగ,గాలయ్య, రవి మాదిగ, పవన్ మాదిగ పాల్గొన్నారు.

నాదర్‌గుల్, అల్మాస్‌గూడ డివిజన్లలో అభివృద్ధి పనుల ప్రారంభం

అభివృద్ధి పనుల ప్రారంభానికి విచ్చేసిన మేయర్ పారిజాత

సరూర్‌నగర్, జనవరి 9 ప్రభాతవార్త: బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని 3, 4, 8, 27 డివిజన్లలో చేపట్టిన వివిధ అభివృద్ధి పనులను మేయర్ చిగిరింత పారిజాత నర్సింహ